# ప్రజా తపన

prajathapana.com

News that matters




సుఖమయం, శుభదాయకం, అయిన లోకం సామాజిక ప్రగతి, వేడి మంచు, నల్లని వెలుగుల్లా అసంబద్ధమైనవే. అనర్థాలను సృష్టించని భౌతిక అభివృద్ధి ఉండదు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 22 గురువారం 02 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## రోడ్డెక్కనున్న ఒలెక్ట్రా ఈ-టిప్పర్లు..



**గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ఇండియన్ ఏజెన్సీలు**

**భారతదేశంలో మొట్టమొదటిసారి రోడ్డెక్కుతున్న ఒలెక్ట్రా ఈ-టిప్పర్స్**

**భారతీయ ఆటోమొబైల్ రెగ్యులేటరీ ఏజెన్సీల నుంచి గ్రీన్ సిగ్నల్**

**విజయవాడ :**

మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) అనుబంధ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఓజీఎల్) 6లీ4 హెవీ డ్యూటీ ఎలక్ట్రిక్ టిప్పర్లకు హోమోలోగేషన్ సర్టిఫికెట్ను పొందింది. భారతీయ ఆటోమొబైల్ నియంత్రణ సంస్థల నుంచి ఈ సర్టిఫికెట్ పొందినట్లు సంస్థ వెల్లడించింది. కేంద్రీయ మోటారు వాహన నింబంధనలకు అనుగుణంగా.. ఒలెక్ట్రా 6లీ4 హెవీ డ్యూటీ ఎలక్ట్రిక్ టిప్పర్ రోడ్డుపైకి వచ్చేందుకు అవసరమైన అన్నిఅనుమతులు సాధించింది. ఒలెక్ట్రా తయారు చేసిన దేశంలోనే తొలి ఈ-టిప్పర్ మన రహదారులకు అనువైనదో లేదో తెలుసుకునేందుకు పర్వత ప్రాంతాలు, ఎత్తైన ప్రదేశాలు, మైనింగ్, క్వారీతో సహా వివిధ ప్రాంతాలలో పరీక్షలు చేసి సర్టిఫికెట్ను జారీ చేశారు. ఒలెక్ట్రా ఈ-టిప్పర్లు హోమోలోగేషన్ సర్టిఫికెట్ పొందిన సందర్భంగా.. ఆ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కేవీ. ప్రదీప్ మాట్లాడుతూ.. "భారతదేశంలో ఎలక్ట్రిక్ హెవీ వెహికల్ సెగ్మెంట్లో ఒలెక్ట్రా ప్రధాన పాత్ర పోషిస్తోందని, తమ సంస్థలో తయారైన ఈ-టిప్పర్ దేశంలోనే మొట్టమొదటి సర్టిఫైడ్ హెవీ డ్యూటీ ఎలక్ట్రిక్ టిప్పర్గా నిలిచింది." అని చెప్పారు.

# ఉద్యోగులకు 'ఎన్నికల' బొనాంజా

### సమ్మె గండం గట్టెక్కిన బొమ్మై సర్కారు

**బెంగళూరు:**

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లకు కర్ణాటక సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మూల వేతనాన్ని 17శాతం పెంచుతూ బుధవారం కీలక ప్రకటన చేసింది. దీంతో పాటు పింఛను విధానంపై కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో ఉద్యోగులు తమ సమ్మెను విరమించారు.

కర్ణాటక చరిత్రలో దాదాపు 25 ఏళ్ల తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. బేసిక్ శాలరీని 40శాతం పెంచడంతో పాటు 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం జీతాలను సవరించాలని, పాత పింఛను విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం ఉద్యోగులంతా సమ్మె చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. అయితే, మరో మూడు నెలల్లో శాసనసభ ఎన్నికలకు సిద్ధమవుతున్న సీఎం బసవరాజ్ బొమ్మై సర్కారుకు ఈ సమ్మె ఓ గండంలా మారింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి దిగొచ్చారు. గంటల వ్యవధిలోనే వేతన పెంపుపై కీలక ప్రకటన చేశారు. ఈ పెంపుతో ఉద్యోగులకు



కాస్త ఉపశమనం కల్పించి సమ్మె గండం నుంచి గట్టెక్కారు. ఈ సందర్భంగా బొమ్మై మాట్లాడుతూ.. "ప్రభుత్వ ఉద్యోగులందరి వేతనాన్ని 17శాతం పెంచుతున్నాం. దీనికి సంబంధించి ఇప్పటికే ఉత్తర్వులు కూడా జారీ చేశాం. ఇక 7వ వేతన సవరణ సంఘం అమలు గురించి కూడా ఉద్యోగ సంఘాలతో చర్చించా. ఇక నూతన పింఛను విధానాన్ని అధ్యయనం చేసేందుకు అదనపు ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నాం. ఆ కమిటీ రెండు నెలల్లో తమ నివేదిక సమర్పిస్తుంది. ఆ తర్వాత సమస్య కూడా పరిష్కారమవుతుంది. అందువల్ల ఉద్యోగులు సమ్మె విరమించి వెంటనే విధుల్లో చేరాలి" అని కోరారు. ముఖ్యమంత్రి ప్రకటనతో సంతృప్తి చెందిన ఉద్యోగ సంఘాలు సమ్మె విరమించాయి. ఉద్యోగులంతా తక్షణమే తిరిగి విధుల్లో చేరాలని చెప్పినట్లు కర్ణాటక రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సి.ఎస్.షడాక్షరి మీడియాకు తెలిపారు. కర్ణాటక ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం మే 24తో ముగియనుంది. అంతకంటే ముందే ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. మార్చి నెలాఖరులోగా ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు.



## ఢిల్లీలో దారుణం..

**న్యూఢిల్లీ, :**

దేశ రాజధాని ఢిల్లీలో దారుణం చోటు చేసుకుంది. కాళింది కుంజ్‌లో మయన్మార్‌కు చెందిన ఓ మహిళల(21)పై సామూహిక అత్యాచారం జరిగింది. ఒక ఆటో డ్రైవర్ ఆమెను అపహరించి, తన గదికి తీసుకెళ్లాడు. అక్కడ అతనితో కలిసి మొత్తం నలుగురు వ్యక్తులు.. ఆమెపై ఒకరి తర్వాత మరొకరు అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఆమెను అదే ఆటోలో ఓ మారుమూల ప్రాంతానికి తీసుకెళ్లి వదిలేశారు. అక్కడి నుంచి నేరుగా ఇంటికి వెళ్లిన ఆ మహిళ.. జరిగిన దారుణాన్ని తన భర్తకు చెప్పింది. భర్తతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు సామూహిక అత్యాచారం, కిడ్నాప్, దాడి, బెదిరింపు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే.. ఇప్పటివరకూ ఎవ్వరినీ అరెస్ట్ చేయలేదు. మయన్మార్ నుంచి రిజిస్టర్డ్ శరణార్థి అయిన ఆ మహిళ

## లక్ష చండీ మహాయజ్ఞంపై త్వరలో డాక్యుమెంటరీ

**విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి**

**పీఠంపై కొందరు రాజకీయ ముద్ర వేస్తున్నారన్న స్వామిజీ**

**రాజశ్యామల అనుగ్రహం అందరికీ ఉండాలన్నదే పీఠం ఆకాంక్ష అన్న ఉత్తరాధికారి**

**విశాఖపట్నం**

విశాఖ శ్రీ శారదాపీఠం పర్యవేక్షణలో విజయవంతంగా సాగిన శ్రీ లక్ష చండీ మహా యజ్ఞంపై త్వరలో డాక్యుమెంటరీని రూపొందించబోతున్నామని విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి ప్రకటించారు. ఈ భూమండలంపై లక్ష చండీ మహా యజ్ఞాన్ని తొలిసారి నిర్వహించిన ఘనత విశాఖ శ్రీ శారదాపీఠానికే దక్కుతుందని, భవిష్యత్ తరాలకు ఈ వివరాలను అందించే ఉద్దేశ్యంతోనే డాక్యుమెంటరీని రూపొందించే ఆలోచన చేస్తున్నామని వివరించారు. స్వాత్మానందేంద్ర స్వామి బుధవారం ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడారు. ధర్మబద్ధంగా, శాస్త్రబద్ధంగా లక్ష చండీ యజ్ఞాన్ని ఎలా నిర్వహించాలనే దానిపై 8నెలల పాటు కసరత్తు చేసామని వివరించారు. అనేక గ్రంధాలను తిరగేసిన తర్వాత శాస్త్రీయ కోణంలో లక్ష చండీ యజ్ఞం నిర్వహణపై ప్రణాళిక రచించామని



వివరించారు. భవిష్యత్తులో ఈ యజ్ఞాన్ని తలపెట్టాలనుకునే వారు తమను సంప్రదించవచ్చని అన్నారు. హిందూ జాతిని జాగృతం చేసేందుకే దేశ నలుమూలల నుండి వచ్చిన రుత్విక్కులకు యజ్ఞంలో భాగస్వామ్యం కల్పించామని వివరించారు. విలేకరుల ప్రశ్నకు బదులిస్తూ కొందరు పనిగట్టుకుని తమ పీఠంపై రాజకీయ ముద్ర వేస్తున్నారని అన్నారు. కానీ, రాజశ్యామల అనుగ్రహం అందరికీ ఉండాలనే తమ పీఠం భావిస్తుందని చెప్పారు. అమ్మవారి అనుగ్రహం కోసం వచ్చే నేతల కారణంగా ప్రత్యేక ఆకర్షణ అవుతోందని వివరించారు. విశాఖ శ్రీ శారదాపీఠం ఎవరికీ వత్తాసు పలకదని, హిందూ ధర్మం వైపే నిలబడుతుందని స్పష్టం చేసారు. రాజకీయ పార్టీల కోసం పూజలు చేయడం లేదని, రాజశ్యామల అమ్మవారి అనుగ్రహం కోరుకునే వారి కోసం మాత్రమే పీఠంలో పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విశాఖ శ్రీ శారదాపీఠానికి వ్యక్తిగత ఆలోచనలు ఉండబోవని, సమాజ హితం కోసం మాత్రమే పని చేస్తుందని స్పష్టం చేసారు



## ఇద్దరు మంత్రులు రాజీనామా.

### . కేజ్రీవాల్ ఆమోదం

**న్యూఢిల్లీ,**

ఢిల్లీ రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. మంత్రులు సత్యేంద్ర జైన్, మనీశ్ సిసోడియా రాజీనామా చేశారు. మంత్రి పదవులకు రాజీనామా చేస్తూ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు లేఖలు పంపారు. ఈ మేరకు కేజ్రీవాల్ వీరిద్దరి రాజీనామాలను ఆమోదించారు. మనీశ్ సిసోడియాకు 18 మంత్రిత్వ శాఖల బాధ్యత అప్పగించారు కేజ్రీవాల్. అంతకు ముందు ఆరోగ్య శాఖ మంత్రిగా వ్యవహరించారు సత్యేంద్ర జైన్. అయితే ఆయన కూడా ఓ స్కామ్‌లో భాగంగా అరెస్ట్ అయ్యారు. దాదాపు 10 నెలలుగా జైల్లోనే ఉంటున్నారు. ఆయన జైలుకి వెళ్లిన తరవాత ఆరోగ్య శాఖ కూడా సిసోడియాకు అప్పగించారు కేజ్రీవాల్. ఇప్పుడు సిసోడియా కూడా సీబీఐ కస్టడీలో ఉన్నారు. లిక్కర్ స్కామ్‌లో మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సీబీఐ అరెస్ట్ చేసినప్పటికీ సిసోడియా మంత్రిత్వ పదవిలో ఎలా కొనసాగుతున్నారంటూ బీజేపీ ఇప్పటికే ప్రశ్నలు సంధించింది. ఆ వెంటనే ఇద్దరు మంత్రులు రాజీనామా చేయడం సంచలనమైంది. అఃఐ అరెస్ట్‌ని సవాల్ చేస్తూ ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఢిల్లీ హైకోర్టునే ఆశ్రయించాలంటూ సూచించింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు నిచ్చింది.

(మిగతా 2లో)

# ఇద్దరు మంత్రులు రాజీనామా.

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టులో ప్రత్యామ్నాయ మార్గాలు దొరికే అవకాశముందని వ్యాఖ్యానించింది. నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా హైకోర్టులోనే తేల్చుకోవాలని తేలప్చి చెప్పింది. ఈ పరిస్థితుల్లో ఇలాంటి పిటిషన్ విచారించడం కుదరదని స్పష్టం చేశారు చీఫ్ జస్టిస్ డీపై చంద్రచూడ్. ఈ మేరకు తాము ఢిల్లీ హైకోర్టుకు వెళ్లి న్యాయపోరాటం కొనసాగిస్తామని ఆప్ తెలిపింది. తనిఖీల్లో ఎలాంటి నగదు దొరకలేదని, ఛార్జ్‌షీట్‌లోనూ ఆయన పేరు లేదని సిసోడియా తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోర్టుకి తెలిపారు. అయితే…ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి బిజీగా ఉంటున్నారని వివరించారు. ఆయనే ట్రిబ్యునల్ విధులూ నిర్వర్తిస్తు న్నారని చెప్పారు. సిసోడియా అరెస్ట్‌ను తప్పు పట్టారు సింఘ్వీ. అయితే…సుప్రీంకోర్టు మాత్రం "మీరేం చెప్పినా హైకోర్టులోనే చెప్పుకోండి. మేం ఈ పిటిషన్‌ను విచారించలేం" అని తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టు తీర్పుని గౌరవిస్తామని, హైకోర్టుకు వెళ్తామని ఆప్ స్పష్టం చేసింది.

# 60 లక్షల మంది ఉద్యోగులు..

## 77 లక్షల మంది పెన్షనుదారులు

**న్యూఢిల్లీ :**

యాక్టివ్‌గా ఉన్న ఉద్యోగుల కంటే కేంద్రం నుంచి పింఛన్ తీసుకుంటున్న వారి సంఖ్యే భారీగా ఉందన్నారు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్. ప్రస్తుతం పింఛన్ దారులు 77 లక్షల మంది ఉంటే… 50-60 లక్షల మంది యాక్టివ్ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు."నేడు, దాదాపు 6,000-7,000 మంది పింఛనుదారులు '100 ఏళ్లుకు మించిన వారు జీతంగా సంపాదించిన మొత్తాన్ని పెన్షన్‌గా తీసుకుంటున్నారు. దాదాపు లక్ష మంది పింఛనుదారులు '90 నుంచి 100 సంవత్సరాల' వయస్సు వాళ్లు ఉన్నారు.అని ఆయన అన్నారు. 49వ ప్రీ-రిటైర్మెంట్ కౌన్సెలింగ్ వర్క్‌షాప్‌లో సింగ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం, విడాకులు తీసుకున్న కుమార్తెలు కుటుంబ పెన్షన్‌కు అర్హులని చేశాం, పింఛను/కుటుంబ పింఛన్‌కు సంబంధించిన ఏడేళ్ల సర్వీసు అర్హతను రద్దు చేశామని చెప్పారు. "ఫ్యూడల్ మనస్తత్వం నియంత్రణ పాలనను విముక్తి చేయడమే దీని ఉద్దేశ్యం అని ఆయన అన్నారు. భవిష్య పోర్టల్‌తో కెనరా బ్యాంక్ పెన్షనర్స్ పోర్టల్‌ను ఇంటిగ్రేట్ చేయడంతోపాటు 'హఃఎ ఇంటిగ్రేటెడ్ పోర్టల్'లో కొత్త సేవలను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ప్రారంభించారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ ఎక్స్‌ట్రార్డినరీ పెన్షన్ రూల్స్ బుక్, 2023ని కూడా ఆవిష్కరించారు. 11.25 లక్షల మంది పింఛనుదారులందరినీ ఆన్‌లైన్‌లోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పెన్షన్లు ఞ పెన్షనర్ల సంక్షేమ శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ తెలిపారు. పెన్షనర్ల సంక్షేమం కోసం డిపార్ట్‌మెంట్ సులంభంగా సంప్రదించడానికి ఇది సహాయపడుతుందన్నారు. "ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్ పెన్షన్ సేవా పోర్టల్‌లను భవిష్య పోర్టల్‌తో అనుసంధానించే పని పూర్తయింది. ఈ ఇంటిగ్రేషన్‌తో, పెన్షనర్లు తమ పెన్షన్ స్లిప్, లైఫ్ సర్టిఫికేట్ సబ్‌మిట్ స్టేటస్, ఫారం-16 ఇంటిగ్రేటెడ్ పెన్షనర్స్ పోర్టల్ ద్వారా పొందవచ్చు. పెన్షన్-విడుదల చేసే మొత్తం 18 బ్యాంకులు ఇంటిగ్రేటెడ్ పెన్షనర్స్ పోర్టల్‌లో భాగంగా ఉంటాయి, ''అని కేంద్రమంత్రి చెప్పారు.

# 12న విచారణకు రండి

**హైదరాబాద్ :**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దూకుడు పెంచింది.. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు మారింది వైఎస్ వివేకా హత్య కేసుతో.. ఆ తర్వాత హైదరాబాద్‌లో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ ఓవైపు.. దర్యాప్తులో ఇంకో వైపు.. ఇలా దూకుడు చూపిస్తోంది సీబీఐ.. ఇక, ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డికి తాజాగా మరోసారి నోటీసు జారీ చేశారు సీబీఐ అధికారులు.. వైఎస్ భాస్కర్‌రెడ్డికి సీఆర్‌పీసీ 160 కింద నోటీసులు జారీ చేశారు.ఫిబ్రవరి 28వ తేదీ అంటే మంగళవారం సాయంత్రం పులివెందులలోని వైఎస్ భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లిన సీబీఐ సిబ్బంది.. ఆయనకు నోటీసులు అందజేశారు.. కడప సెంట్రల్ జైలు గెస్ట్ హౌస్‌లో లేదా హైదరాబాద్‌లోని సీబీఐ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన విచారణకు హాజరు కావాలని తన నోటీసుల్లో పేర్కొంది సీబీఐ.. అయితే, గత నెల 18వ తేదీన తొలి సారి వైఎస్ భాస్కర్ రెడ్డికి నోటీసు ఇచ్చింది సీబీఐ.. 23వ తేదీన విచారణకు రావాలని పేర్కొంది. కానీ, ముందస్తు కార్యక్రమాలతో గత నెల 23న విచారణకు రాలేనని సీబీఐకి సమాచారం ఇచ్చారు భాస్కర్ రెడ్డి.. ఈ నేపథ్యంలో మరో సారి సీబీఐ నోటీసులు ఇచ్చింది.. ఈ నెల 12వ తేదీన విచారణకు హాజరుకావాలని పేర్కొంది. కాగా, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఇప్పటికే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సీబీఐ రెండు సార్లు ప్రశ్నించింది.. రెండోసారి విచారణ తర్వాత మీడియాతో మాట్లాడిన ఆయన.. నిజాన్ని లక్ష్యంగా చేసుకుని విచారణ చేయకుండా.. వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని విచారణ చేస్తున్నారని ఆరోపించారు.. '100'గా ఉన్న నిజాన్ని '0'గా చూపించే ప్రయత్నం.. '0'గా ఉన్న అబద్ధాన్ని 100గా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన విషయం విదితమే.

# సెవెన్ హిల్స్ హాస్పిటల్ లో కీళ్ల మార్పిడి అందుబాటులో

**నంద్యాల**

నంద్యాల సెవెన్ హిల్స్ హాస్పిటల్ లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడానికి ఆర్థోపెడిక్ విభాగంలో కీళ్ల మార్పిడి చికిత్స లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సెవెన్ హిల్స్ ఆసుపత్రి యజమాని మారుతీ కుమార్ పేర్కొన్నారు.ఆసుపత్రి 8 వ వార్షికోత్సవం శుభ సందర్భంగా ఆర్థోపెడిక్ విభాగాన్ని ప్రారంభించారు.పట్టణ ప్రముకులందరు ఆర్థోపెడిక్ విభాగము ప్రారంభోత్సవం కు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మారుతీ కుమార్ మాట్లాడుతూ, ఆసుపత్రి లో గత ఏడేళ్లుగా జనరల్ మెడిసిన్,జనరల్ సర్జరీ,చెవి,ముక్కు విభాగాల్లో వైద్యసేవలు అందించామని అన్నారు.పట్టణ, గ్రామీణప్రాంతవాసులకు మెరుగైన వైద్యసేవలు అందించామని పేర్కొన్నారు.ప్రస్తుత సమాజంలో అత్యధికంగా మోకాళ్ళ నొప్పులతో కీళ్ల మార్పిడి చేసుకుంటున్నారని అన్నారు.గతంలో హైద్రాబాదు,చెన్నై నగరాలకు వెళ్లి కీళ్ల మార్పిడి చూసుకునేవారని,ఇకపై అంత దూరం వెళ్లకుండా మా ఆసుపత్రిలోనే ఈ సౌకర్యం ఏర్పాటు చేశామని అన్నారు.ఆర్థోపెడిక్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు కిరణ్ కుమార్ కీళ్ల వాతం,కీళ్ల మార్పిడి తదితర ఆర్థోపెడిక్ సేవలు అందిస్తారని అన్నారు.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ,ఈ,హెచ్,ఎస్,ఫీజురియంబర్స్ మెంట్ చేయడానికి 25 కంపెనీల తో ఒప్పందం కుదుర్చుకున్నామని అన్నారు.మూడేళ్ళ క్రితం 100 మందికి కీళ్ల మార్పిడి ఉచితంగా చేశామని అన్నారు.గ్యాస్ట్రో ట్రీట్ మెంట్ అందుబాటులోకి తీసుకొని వచ్చామని పేర్కొన్నారు.రిటైర్డ్ ఉద్యోగులు కొందరికి ఈ ఏడాది కీళ్ల మార్పిడి ఉచితంగా అందిస్తామని అన్నారు.

# ఓటర్లను ప్రత్యక్షంగా కలవండి

**గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీలను మనం గెలవాలి**
**వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను ఆశీర్వదించండి**
**బూత్ కమిటీ సభ్యులు సమర్థవంతంగా పనిచేయాలి**
**రానున్న 10 రోజులు మనకు అత్యంత కీలకం**
**సీఎం జగన్ చేసిన మంచిని అందరికీ వివరించాలి**
**ఒకే నోటిఫికేషన్‌తో లక్షా 36 వేల పోస్టులు భర్తీ చేశాం**
**డీఎస్సీ 98 క్వాలిఫైడ్‌లకు ఉద్యోగాలిచ్చింది మనమే**
**ఈ విషయాలన్నింటినీ నేరుగా కలిసి వివరించండి**
**పార్టీ శ్రేణులు, బూత్ కమిటీలకు ఎమ్మెల్యే అనంత దిశానిర్దేశం**



**అనంతపురం :**

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. నగరంలోని యాపిల్ గార్డెన్స్‌లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు, ఎమ్మెల్సీ ఎన్నికలకు భిన్న వాతావరణ ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో యువత, ఉపాధ్యాయ వర్గాలను ప్రజాప్రతినిధులతో పాటు బూత్ కమిటీ సభ్యులు నేరుగా కలవాలని తెలిపారు. ఇప్పటికే ఓటరు జాబితాలను అందజేశామని, డివిజన్ వారీగా ఓటర్లు ఎంత మంది ఉన్నారన్నది స్పష్టంగా తెలుసన్నారు. వారిందరినీ ప్రత్యక్షంగా కలవాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి గతంలో జెడ్పీలో ప్రతిపక్ష నేతగా సమర్థవంతంగా పని చేశారన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి కూడా ఉపాధ్యాయ వర్గాల మద్దతు ఉందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. కానీ ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాలు చేస్తున్నాయని.. వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను పక్కదారి పట్టించే కార్యక్రమాలు జరుగుతున్నాయని, అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. గత సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ 151 స్థానాల్లో విజయం సాధించిందని, ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైసీపీ అద్భుత విజయాలు సొంతం చేసుకుందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఊహకందని విజయం మన సొంతం కావాలన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఓటర్లు తక్కువ సంఖ్యలో ఉన్న నేపథ్యంలో వర్క్ డివిజన్ చేసుకుని అందరినీ కలవాలని సూచించారు.

## మనం చేసిన మంచిని చెప్పండి

వైసీపీ అధికారంలోకి వచ్చాక చేసిన మంచిని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని ఎమ్మెల్యే అనంత తెలిపారు. ఒకే నోటిఫికేషన్‌తో లక్షా 36 వేల పోస్టులను భర్తీ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదని అన్నారు. వైద్య ఆరోగ్యశాఖలోనూ 40 వేల పోస్టులు భర్తీ చేశామన్నారు. పోలీస్, న్యాయశాఖలోనూ ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. ప్రధానంగా డీఎస్సీ%--%98 క్వాలిఫైడ్‌లకు ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. ఏపీపీఎస్సీ ద్వారా కూడా ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమాన్ని అందించిన ఘనత మన ప్రభుత్వానిదని



తెలిపారు. నాడు%--%నేడు కింద అటు స్కూళ్లు, ఇటు ఆస్పత్రుల రూపురేఖలు మార్చామన్నారు. ఈ విషయాలన్నింటినీ ఓటర్లకు వివరించాలని చెప్పారు. భవిష్యత్ తరాలు బాగుండాలన్న తపనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారని తెలిపారు. కేవలం ఓటర్లను కలవడమే కాకుండా పోలింగ్ రోజు బూత్ వరకు తీసుకురావాల్సిన బాధ్యత అందరూ తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియ బ్యాలెట్ పద్ధతిలో ఉంటుందని, మొదటి ప్రాధాన్యత ఓటును ఎలా వేయాలో ఓటర్లకు వివరించాలని సూచించారు. వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

## విజయమే లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్సీ ఎన్నికలను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీ రంగయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంక్షేమ పథకాలను అందరికీ వివరించాలన్నారు. విజయమే లక్ష్యంగా అందరూ పని చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ఎలా ఉంటుంటో గ్రాడ్యుయేట్స్ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు చింతా సోమశేఖరరెడ్డి (వైసీపీ నగర అధ్యక్షుడు), ఆలమూరు శ్రీనివాసరెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, చింతకుంట మధు, లక్ష్మన్న, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా, వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గౌస్‌బేగ్, మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు, బూత్ కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# శాసనమండలి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం

**అనంతపురం :**

కడప- అనంతపురం- కర్నూలు జిల్లాల పట్టభద్రుల మరియు ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ఎస్.నాగలక్ష్మిరాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, బందోబస్త్,శిక్షణ, ఓటర్ స్లిప్స్ పంపిణీ, తదితర ఏర్పాట్లపై బుధవారం జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, పోలీసు అధికారులతో రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, కడప- అనంతపురం- కర్నూలు జిల్లాలలో పట్టభద్రుల నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్య చాలా ఎక్కువగా ఉన్నందున బ్యాలెట్ పేపర్ సైజు విషయమై కేంద్ర ఎన్నికల సంఘం అనుమతికి పంపడం జరిగిందని, వారి నుండి ఈరోజు కానీ లేదా రేపటి రోజుకు అనుమతి వస్తుందన్నారు. బ్యాలెట్ పేపర్లకు అనుగుణంగా బ్యాలెట్ బాక్స్ లను కూడా సిద్ధం చేసుకోవాలని, అదనంగా కూడా ఏర్పాటు చేసుకోవాలని ఆర్వోకు సూచించారు. ఈ సందర్భంగా న్యూస్ పేపర్ తో ఒక డమ్మీ బ్యాలెట్ పేపర్ ను ఉపయోగించి అవి బ్యాలెట్ బాక్స్ లో ఎన్ని బ్యాలెట్



పేపర్లు పడుతుందో అంచనా వేస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కలెక్టర్ వివరించారు. బ్యాలెట్ పేపర్ల ఫోల్డింగ్ పై కూడా పోలింగ్,సహాయ పోలింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సిందిగా ఆయన జిల్లా కలెక్టర్ కు సూచించారు.

స్థానిక కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ, ఓటర్స్ క్లిప్పులను ముద్రించి మండలాలకు కూడా పంపిణీ చేస్తున్నామని ఈ ప్రక్రియను ఈనెల ఎనిమిదో తేదీ లోపు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే పోలింగ్,సహాయ పోలింగ్ అధికారులకు ఒక దశ శిక్షణ పూర్తి చేశామని, మైక్రో అబ్జర్వర్లకు ఈనెల 9వ తారీఖున మరల పిఓలకు అసిస్టెంట్ పి వో లకు పదో తారీఖున మరొక మారు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు .వెబ్ కాస్టింగ్ కొరకు ఏజెన్సీని గుర్తించామన్నారు.జిల్లాలో పట్టభద్రుల మరియు ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రాలు 117 ఉన్నాయని అందులో 45 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. అందుకు తగిన విధంగా పోలీస్ బందోబస్తులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి ఈనెల 11వ తేదీన శిక్షణ ఇస్తున్నామని, ఇందుకోసం కౌంటింగ్ శిక్షణలో నిష్ణాతులైన ఒక డి టి ,5 మంది తహసిల్దార్లను నియమించామన్నారు. స్వీప్ కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నామనన్నారు. ఎన్నికలకు సంబంధించిన బిల్స్ ను అప్లోడ్ చేయడం జరిగిందన్నారు.74.7 6 ఆధార్ సేకరించడం జరిగిందన్నారు. నిన్నటి రోజున 5 జిల్లాలకు చెందిన డిఆర్ఓ లతో ఎన్నికల నిర్వహణపై విసి నిర్వహించడం జరిగిందన్నారు

విజయవాడ కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కడప- అనంతపురం- కర్నూలు జిల్లాల నియోజక వర్గ ఎన్నికల పరిశీలకులు డా.పోలా భాస్కర్ మాట్లాడుతూ, నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు అనంతపురం నందు తాము ఉన్నామని, అక్కడి నోడల్ అధికారులతో సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, ఎస్పీతో బందోబస్తు ప్రణాళిక పై కూడా చర్చించడం జరిగిందన్నారు. ఇక్కడ అన్ని కార్యక్రమాలు సజావుగా జరుగుతోందన్నారు. రానున్న వారంలో తాను మరొక ఎన్నికల పరిశీలకులు హరిజవహర్ లాల్ తో కలిసి ఇతర జిల్లాలలో పర్యటిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఓ గాయత్రీ దేవి, అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, వివిధ నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాప్య ఫించన్లలలో మార్పులు

**విజయవాడ :**

ఏపీలో వృద్ధాప్య పింఛన్ల పంపిణీలో కీలక నిర్ణయం తీసుకుంది. వృద్ధులకు వేలిముద్రలు పడకపోవడంతో పింఛన్ పంపిణీలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు వేలిముద్రల సమస్య ఉన్న వృద్ధులకు ఆధార్ అనుసంధానంతో లబ్ధిదారుని ఫేస్ ను యాప్‌లో సరిపోల్చుకొని పెన్షన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం వాలంటీర్లను ఆదేశించింది. మార్చి 1 నుంచి ఈ విధానం అమలుచేయాలని నిర్ణయించింది. అలాగే వేలిముద్రల విధానంతో ఇతర పద్ధతులు కొనసాగుతాయని ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి వృద్ధాప్య పింఛన్ పెంచింది ప్రభుత్వం. సామాజిక పెన్షన్లు 2750కి పెంచి జనవరి ఒకటో తేదీ నుంచే పంపిణీ చేస్తుంది. రూ.250 పెంచి రూ. 2,750కి పెన్షన్ అందిస్తున్నారు. రాష్ట్రంలో 64.74 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దీంతో పెన్షన్లకు నెలకు అందిస్తున్న మొత్తం రూ.1786 కోట్లకు చేరింది. ఆ తర్వాత 2024 జనవరికి రూ.3000 పింఛన్ అందిస్తామని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. దీంతో ఎన్నికల హామీ పూర్తి చేసినట్లు అవుతుందంటున్నారు. పింఛన్ల కోసం రూ.130.44 కోట్లు నెలకు అదనపు వ్యయం వెచ్చిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.ఏపీలో వరుసగా నాలుగో ఏడాది వైఎస్ఆర్ రైతు భరోసా నిధులను సీఎం జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి విడుదల చేశారు. ఈ ఏడాది మూడో విడతగా 51.12 లక్షల మందికి రూ.1,090.76 కోట్ల నిధులను విడుదల చేశారు. మంగళవారం (ఫిబ్రవరి 28) తెనాలి మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో సీఎం జగన్ మాట్లాడారు. వరు□సగా నాలుగో ఏడాదిలో కూడా ఇప్పటికే రెండు విడతల్లో రూ.11,500 సాయం అందించారు. మూడో విడతగా ఒక్కొక్కరికి మరో రూ.2 వేల చొప్పున 51.12 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.1,090.76 కోట్లు వేశారు.

# అమల్లోకి డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రామ్

**గుంటూరు :**

పీజీ వైద్య విద్యార్థులందరూ డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రాం కింద గ్రామీణ ఆసుపత్రుల్లో తప్పనిసరిగా మూడు నెలలపాటు పనిచేసే విధానం బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లోని విద్యార్థులకు దీన్ని అమలుచేసేందుకు తగిన చర్యలు తీసుకున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని వెల్లడించారు. మంగళగిరిలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో ఫిబ్రవరి 28న ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రుల వారీగా మ్యాపింగ్ చేసిన జాబితాను వైద్య కళాశాలలకు పంపామన్నారు. ఈ జాబితాలో ఉన్న పీజీ విద్యార్థులు తప్పనిసరిగా ఆసుపత్రుల్లో బ్యాచ్‌ల వారీగా పనిచేస్తారని తెలిపారు. ప్రతి బ్యాచ్‌లో 250 మంది విద్యార్థులు ఉంటారన్నారు. తెలంగాణలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ జరగకుండా యాంటీ ర్యాగింగ్ కమిటీలు చర్యలు తీసుకోవాలన్నారు. కొంతమంది ప్రొఫెసర్లు సొంత క్లినిక్స్ పెట్టుకుని పీజీ విద్యార్థులపై పనిభారం మోపుతున్నారన్న సమాచారం ఉందని, ఇలాంటివి జరగకుండా చూడాలని కోరారు. చదువుల ఒత్తిడి లేకుండా కళాశాలల్లో అవసరమైన వాతావరణాన్ని సృష్టించాలని, విద్యార్థుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకంగా పెట్టెలు ఏర్పాటుచేయాలన్నారు. కళాశాలల్లోని ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. ప్రతి విద్యార్థిని దిశ యాప్ ఉపయోగించేలా అవగాహన కల్పించాలన్నారు. సీనియర్, జూనియర్ వైద్య విద్యార్థులకు వేర్వేరుగా భోజన సమయాలు ఉండాలని సూచించారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనిప్రకారం పీజీ వైద్య విద్యార్థులకు మార్చి 1 నుంచి 'డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రామ్' అమలుచేస్తున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ వైద్య విద్యను అభ్యసించే వారు కోర్సు ముగిసేలోగా మూడు నెలలపాటు జిల్లా ఆసుపత్రుల పరిధిలో పనిచేయడాన్ని ఎన్ఎంసీ తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. గతేడాది నుంచే ఈ విధానాన్ని అమలుచేసేందుకు ప్రయత్నించగా కొవిడ్ కారణంగా సాధ్యపడలేదు. ఈ మినహాయింపును ఎన్ఎంసీ తొలగించడంతో ఈ ఏడాది నుంచి అమలుచేసేందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలోని 30 ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో కలిపి సుమారు రెండువేల మంది ప్రతి ఏటా పీజీలో ప్రవేశాలు పొందుతున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రథమ, మూడో సంవత్సరం చదివే సమయంలో కాకుండా రెండో సంవత్సరం విద్యార్థులకు మాత్రమే ఈ డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రామ్‌ను అమలుచేస్తామని డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్ వెల్లడించారు.

# ఇక 2 రోజులు విశాఖలోనే...

**విశాఖపట్టణం:**

ఏపీ రాజధాని విషయంలో సీఎం జగన్ వెనక్కి తగ్గేదేలే అంటున్నారు. మూడు రాజధానుల అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నప్పటికీ ఢిల్లీ వేదికగా సీఎం జగన్ విశాఖ రాజధాని అని.. త్వరలోనే తాను కూడా షిఫ్ట్ అవుతానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒకవైపు అమరావతి ఉద్యమం జరుగుతున్నప్పటికీ రాజకీయ పక్షాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ బీజేపీ సైతం మోకాలడ్డుతున్నా నిర్ణయం తీసుకున్నా వెనక్కి తగ్గను అన్నట్లు సీఎం జగన్ వ్యవహరిస్తున్నారు. వీలైనంత త్వరలో విశాఖకు షిఫ్ట్ అవ్వాలని నిర్ణయించుకున్నారు. మార్చి రెండో వారం లేదా ఏప్రిల్ మొదటి వారానికల్లా విశాఖకు తరలిపోవాలని సీఎం జగన్ ముహూర్తం ఫిక్స్ చేసుకున్నట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశాఖ నుంచి పరిపాలన కొనసాగించడానికి అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం చేస్తోంది. కొన్ని రోజులుగా జగన్ నివాసానికి సంబంధించి విశాఖలో అధికార యంత్రాంగం జల్లెడ పట్టింది. అయినప్పటికీ ఎక్కడా నివాసానికి ఇల్లు దొరకలేదు. దీంతో ప్రస్తుతానికి తాత్కాలికంగా పోర్ట్ గెస్ట్‌హౌస్ నుంచే సీఎం జగన్ పరిపాలన చేసేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సీఎం నివాసానికి సంబంధించి రిషికొండలో ఇప్పటికే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అది పూర్తయ్యేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉందని తెలియడంతో ప్రస్తుతానికి పోర్ట్ గెస్ట్‌హౌస్ నుంచే పాలన చేయాలని



నిర్ణయించినట్లు తెలుస్తోంది.రిషికొండలో ఇంటి నిర్మాణం పూర్తి అయితే అక్కడ నుంచే ఇక పాలన పూర్తి స్థాయిలో అందించాలని సీఎం జగన్ భావించారు. అయితే అందుకు పరిస్థితులు అనుకూలించడం లేదు. ఇంటి నిర్మాణానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పోర్ట్ గెస్ట్ హౌస్‌లో ఉంటూ పాలన చేపట్టాలని సీఎం జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వారంలో రెండు రోజులు మాత్రమే అక్కడ నుంచి పరిపాలన కొనసాగించాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. షిఫ్ట్ అయిన తర్వాత ప్రతి సోమ, మంగళవారం విశాఖలోనే సీఎం జగన్ అందుబాటులో ఉంటారని తెలుస్తోంది.ప్రతీ బుధవారం పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఎంపిక చేసిన ప్రాంతంలో సీఎం జగన్ పర్యటించనున్నారు. బుధవారం రాత్రి పల్లె నిద్రలో భాగంగా ఆయా ప్రాంతాల్లో సీఎం జగన్ బస చేయనున్నారు. అనంతరం గురువారం ఉదయం విశాఖకు వెళ్లి అక్కడ నుంచి రాత్రికి అమరావతి చేరుకుంటారని తెలుస్తోంది. శుక్ర, శని, ఆది ఈ మూడు రోజులు సీఎం జగన్ అమరావతిలో ఉంటారని ప్రచారం జరుగుతుంది.

# ఈసీ రాడార్ లో వైసీపీ...

**తిరుపతి :**

రాజకీయ పార్టీలకు ప్రత్యేక విధి, విధానాలు ఉంటాయి. ఇవి ఒక్కో పార్టీకి ఒక్కో విధంగా ఉంటాయి. దానినే పార్టీ రాజ్యాంగం అంటారు. జాతీయ, ప్రాంతీయ అనే తేడా లేకుండా ప్రతి పొలిటికల్ పార్టీ.. ఎన్నికల సంఘానికి తమ రాజ్యాంగాన్ని అందించాల్సి ఉంటుంది. అందులోని నియమావళి.. ప్రజా ప్రాతినిధ్య చట్టానికి లోబడి ఉంటేనే.. ఎన్నికల సంఘం పార్టీలకి గుర్తింపు ఇస్తుంది. అనుమతి పొందిన తర్వాత పార్టీ రాజ్యాంగంలో ఏమైనా మార్పులు, చేర్పులు చేస్తే... వాటిని ఈసీకి తప్పక తెలపాల్సి ఉంటుంది. ఆ మార్పులు కూడా నియమాలు, నిబంధనలకు లోబడి ఉంటేనే ఎన్నికల సంఘం ఆమోదించి... రికార్డుల్లో ఎక్కిస్తుంది. తద్వారా భవిష్యత్తులో పార్టీలో ఏమైనా అంతర్గత సమస్యలు ఉత్పన్నమైన సమయంలో... సమర్పించిన రాజ్యాంగం ఆధారంగా ఈసీ నిర్ణయం తీసుకుంటుంది. అందుకే.. రాజ్యాంగం విషయంలో పార్టీలు చాలాజాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తుంటారు. మధ్యలో చేసిన మార్పులు.. ఈసీ వద్ద అప్డేట్ చేయకపోతే.. మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తుంటారుమహారాష్ట్రలో అధికార శివసేన పార్టీ పేరు, గుర్తు విషయంలో.. ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి, సీఎం ఏక్ నాథ్ షిండే వర్గానికి మధ్య విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ వివాదం కేంద్ర ఎన్నికల సంఘానికి చేరింది. ఫిర్యాదులపై పరిశీలన జరిపిన ఈసీ... శివసేన పేరు, పార్టీ ఎన్నికల గుర్తు "విల్లు - బాణం" .. మహారాష్ట్ర సీఎం ఏక్ నాథ్ షిండే వర్గానికే చెందుతాయని తేల్చి చెప్పింది. ఈ సందర్భంగా.. ఈసీ కీలక అంశాలు ప్రస్తావించింది. పార్టీ పేరు, గుర్తు తమదేనని చెప్పుకోవడానికి ఠాక్రే వర్గం 2018 నాటి పార్టీ రాజ్యాంగం ఆధారపడుతోందని... కానీ, ఆ రాజ్యాంగ సవరణ గురించి ఎన్నికల సంఘానికి తెలియజేయలేదని పేర్కొంది. 2018లో చేసిన సవరణ తమ వద్ద రికార్డు కాలేదని తెలిపింది. పైగా.. అధ్యక్షుడిగా ఎన్నుకోవడానికి ఎలక్టోరల్ కాలేజ్ ని అధ్యక్షుడే నామినేట్ చేసేలా పార్టీ రాజ్యాంగంలో మార్పులు చేశారని.. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ప్రకటించింది. షిండే వర్గానికి అనుకూలంగా ఈసీ నిర్ణయం వెలువడేందుకు పలు అంశాలు కారణమైనా.. అందులో పార్టీ రాజ్యాంగం అంశం కూడా ముఖ్యమైనది కావడం గమనార్హం.ఇక.. కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా ఆంధ్రప్రదేశ్ లోని అధికార వైఎస్సార్సీపీపై దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది. గతేడాది జూలైలో పార్టీ ప్లీనరీ సమావేశాలు నిర్వహించిన వైఎస్సార్సీపీ... వైఎస్ జగన్‌ని జీవితకాల అధ్యక్షుడిగా ప్రకటించింది. అధ్యక్ష నియామకంలో మార్పులతో పాటుగా పార్టీ రాజ్యాంగ సవరణ ప్రతిపాదనలకు కూడా ప్లీనరీ ఆమోదం తెలియజేసింది. పార్టీ రాజ్యాంగంలోని ఆర్టికల్ -1 ప్రకారం... యువజన, శ్రామిక, రైతు కాంగ్రెస్ పార్టీని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీగా లేదా వైఎస్సార్సీపీగా మారుస్తూ తీర్మానం చేశారు. ఇందుకు సంబంధించి మీడియాలో వచ్చిన వార్తలపై స్పందించిన ఈసీ... రాజకీయ పార్టీకి శాశ్వత అధ్యక్షుడి నియామకం అప్రజాస్వామికమని తేల్చి చెప్పింది. ఈ నిర్ణయం చెల్లదని స్పష్టం చేసిన ఎన్నికల సంఘం.. ఏ పార్టీలో కూడా శాశ్వత అధ్యక్షులు ఉండరాదని. పార్టీలో శాశ్వత అధ్యక్షుడు లేదా శాశ్వత పదవులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అభిప్రాయపడింది. అలాంటి ఎన్నిక నియమ నిబంధనలను ఉల్లంఘించినట్లేనని తెలిపింది. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకైనా ఎన్నికలు జరగాలని సూచించింది. రాజకీయ పార్టీలు చేసే అప్రజాస్వామిక సవరణలను గుర్తించేది లేదంది. ఈ మేరకు... వివరణ ఇవ్వాలని వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శికి నోటీసులు పంపింది.ఈసీ నోటీసులతో వైఎస్సార్సీపీ శాశ్వత అధ్యక్షుడి విషయంలో యూటర్న్ తీసుకుంది. ఈ మేరకు నోటీసులకి సమాధానం ఇచ్చిన ఏపీ అధికార పార్టీ.... తమ పార్టీలో శాశ్వత అధ్యక్షుడి ఎన్నిక జరగలేదని వివరణ ఇచ్చింది. జగన్ ను కేవలం 5 ఏళ్ల కాలానికి అధ్యక్షుడిగా ఎన్నుకున్నామని.. ఆ తర్వాత మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అప్పట్లో ప్రకటించారు. జగన్ ను పార్టీకి శాశ్వత అధ్యక్షుడిగా చేయాలన్నది కేవలం నాయకుల అభిలాష మాత్రమే అని... అయితే ఈ ప్రతిపాదనను సీఎం జగన్ ఆదిలోనే తిరస్కరించారని చెప్పారు. మరింత వివరణాత్మకంగా తెలిపేందుకు అంతర్గత కమిటీ వేసి నివేదికను ఈసీకి అందిస్తామని తెలిపారు. అయితే... వైఎస్సార్సీపీ తమ పార్టీ రాజ్యాంగంలో చేసిన సవరణలు ఇప్పటి వరకు ఈసీ రికార్డుల్లోకి ఎక్కలేదని తెలుస్తోంది.ఈ క్రమంలోనే... ఇటీవల మహారాష్ట్రలో శివసేన పార్టీ విషయంలో వివాదానికి తెరదించిన కేంద్ర ఎన్నికల సంఘం.. మిగతా పార్టీల రాజ్యాంగంపై దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది. పార్టీల నియమావళి, రాజ్యాంగంలో సవరణకు సంబంధించి అందిన ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లుగా సమాచారం. వైఎస్సార్సీపీ పేరు మార్పు.. అధ్యక్షుడి ఎన్నికకి సంబంధించిన సవరణలను ఎన్నికల సంఘం అధికారులు క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నారట. సవరణలు ప్రజా ప్రాతినిధ్య చట్టానికి అనుగుణంగా లేకపోతే... వైఎస్సార్సీపీపై చర్యలు తప్పవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో.. పార్టీ పేరు మార్పు సహా పలు కీలక సవరణలపై పరిశీలన అనంతరం.. కేంద్ర ఎన్నికల సంఘం ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తిగా మారింది.

# వరుస తప్పిదాలు... లోపం ఎక్కడా...

**హైదరాబాద్ :**

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ వ్యూహరచనలో ఆరి తేరిన దిట్ట. ఎత్తుకు పైఎత్తులువేసి ప్రత్యర్థులను చిత్తు చేయడంలో ఆయనకు ఆయనే సాటి... అయితే, ఇదంతా నిన్నటి వైభోగం. ఈ రోజు ఆయన ఏమిటో, ఏమి చేస్తున్నారో ఆయనకే అర్థమవుతున్నట్లు లేదు. ఆయన ముందులా ఏ విషయం పైన దృష్టి కేంద్రీకరించలేక పోతున్నారు. ఒకడుగు అటు ఒకడుగు ఇటూ వేసి ఎటు కాకుండా తీసుకుంటున్న నిర్ణయాలతో పార్టీలో క్యాడర్ లో గందరగోళం ఏర్పడుతోంది.ఇది ఎవరో పరాయి వాళ్ళో, ప్రతిపక్షాలో చేస్తున్న ఆరోపణ కాదు. బీఆర్ఎస్ లోని కీలక నేతలే ప్రైవేటు సంభాషణల్లో చెబుతున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మాటల మాంత్రికుడు.. తన వాగ్ధాటితో ఎంతటి వారినైనా మెస్మరైజ్ చేయగలరు. రాజకీయ ఎత్తులు, జిత్తులలో దిట్ట. ఆయన వ్యూహాలు ప్రత్యర్థులకు అంతు చిక్కవు. తెలంగాణ రాష్ట్రంలో ఏ పార్టీ టికెట్ పై గెలిచినా బీఆర్ఎస్ లో చేరాల్సిందే అన్నట్లుగా ఆయన రాజకీయ ఎత్తుగడలు ఉంటాయి. గత ఎనిమిదిన్నరేళ్లుగా రాష్ట్రంలో జరుగుతున్నది ఇదే.అయితే ఇటీవలి కాలంలో ఆయన ఎత్తులు పారడం లేదు. జిత్తులు చిత్తవుతున్నాయి. మాటలతో మాయ చేయడానికి ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. వ్యూహాలు వికటిస్తున్నాయి. ప్రస్తుతం రాజకీయ వర్గాలలోనే కాదు.. సొంత పార్టీ శ్రేణులలోనూ ఇదే మాట వినపడుతోంది. ఆయన జాతీయ రాజకీయాలపై దృష్టి పెట్టినప్పటి నుంచే ఈ పరిస్థితి ఎదురౌతున్నదని పార్టీ శ్రేణులు అంటున్నాయి. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్ గా మార్చడంతోనే రాష్ట్రంలో కూడా ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా వ్యక్తమౌతున్న సంకేతాలు గోచరిస్తున్నాయన్నారు. ఒక వైపు జాతీయ స్థాయిలో బీఆర్ఎస్ విస్తరణకు ప్రణాళికలు రచిస్తూనే.. ఈ ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో పార్టీని గెలుపు బాటలో నడిపించడానికి వ్యూహాలు రచిస్తున్నారు.రెండు పనులూ ఏకకాలంలో చేయాల్సి రావడం వల్లనే ఆయన అటూ ఇటూ కూడా కాన్ సన్ ట్రేట్ చేయలేకపోతున్నారని పార్టీ శ్రేణులు అంటున్నాయి. తొలుత వచ్చే అసెంబ్లీలో సిట్టింగులందరికీ టికెట్లు అంటూ ప్రకటించి, ఒక్కసారిగా వెల్లువెత్తిన అసంతృప్తి, అసమ్మతిని గమనించి పునరాలోచనలో పడాల్సిన పరిస్థితి వచ్చిందని చెబుతున్నారు. ఆపరేషన్ ఆకర్ష్ అంటూ ప్రత్యర్థి పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలకు పార్టీ తలుపులు బార్లా తెరిచి మరీ రెడ్ కార్పెట్ పరిచిన ఫలితం ఇప్పుడు దాదాపు అన్ని నియోజకవర్గాలలోనూ నలుగురైదుగురు పార్టీ టికెట్ ను ఆశిస్తున్న వ్యక్తులు పోటీ పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. దీంతో వచ్చే ఎన్నికలలో బీఆర్ఎస్ రెబల్స్ బెడద ఎదుర్కోవలసిన పరిస్థితి ఉందని అంటున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నప్పటికీ కేసీఆర్ ఇప్పుడు పూర్తిగా సార్వత్రిక ఎన్నికలపై దృష్టి సారించడం వెనుక వ్యూహమేమిటో అర్థం కాక పార్టీ శ్రేణులే తలలు బద్దలు కొట్టుకుంటున్నాయి.పార్టీ ఎంపీల పనితీరు, వారికి ప్రజలలో ఉన్న అభిమానం, వారిలో మళ్లీ టికెట్ ఇస్తే గెలిచే సత్తా ఉన్నవారెవరు ఇత్యాది అంశాలపై ఫోకస్ పెట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మరీ వారి పనితీరు, విజయావకాశాలపై ఆరా తీస్తున్నారు. అన్నిటికీ మించి వారి ఎంపీ నిధులను ఎలా వ్యయం చేస్తున్నారు. ఏయే పనులకు కేటాయిస్తున్నారు. వంటి అంశాలతో ఇప్పటికే కేసీఆర్ ఒక్కో ఎంపీపైనా సమగ్ర నివేదికను సిద్ధం చేశారని పార్టీ శ్రేణులే చెబుతున్నాయి. అలాగే తన నియోజకవర్గ అసెంబ్లీ సెగ్మెంట్లలో వారి పటప్రజలలో ఉన్న అభిప్రాయం, అలాగే వారి నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలతో వారి సంబంధాలు ఎలా ఉన్నాయి.. పార్టీ టికెట్ ఇస్తే.. నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు ఆ ఎంపీకి సహకరిస్తారా? లేదా? కనీసం తన నియోజకవర్గ పరిధిలో పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించుకునే సత్తా ఉందా? వంటి వివరాలన్నీ ఇప్పటికే కేసీఆర్ సేకరించి పెట్టుకున్నారని అంటున్నారు.ఆ వివరాల ఆధారంగానే టికెట్ ఇవ్వాలా వద్దా అన్నది కేసీఆర్ నిర్ణయిస్తారని చెబుతున్నారు. దీంతో ఇప్పటికే సిట్టింగ్ ఎంపీలలో గుబులు నెలకొంది. కేసీఆర్ వద్ద ఉన్న నివేదికలలో తమ ప్రోగ్రెస్ పై ఉన్న రిపోర్ట్ ఏమిటి? మరోసారి పార్టీ టికెట్ దక్కుతుందా? లేదా అన్న టెన్షన్ పెరిగిపోతున్నది. సరిగ్గా ఇదే పరిస్థితి పార్టీ ఎమ్మెల్యేలలోనూ నెలకొని ఉందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటు పార్టీ అధిష్ఠానం ఎన్నికల సన్నాహకాలకు సమాయత్తం అవుతుండటం, అటు ఎమ్మెల్యేలు, ఎంపీలు (సిట్టింగులు) తమకు పార్టీ టికెట్ వస్తుందో రాదో అన్న అయోమయంలో పడటంతో రాష్ట్రంలో ప్రస్తుతం తెరాస పార్టీ పరంగా కార్యక్రమాలేవీ చేపట్టకుండా ఒక విధమైన స్తబ్దతలో కూరుకుపోయిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**వేములవాడ,**

వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్ స్టేషన్ లోమై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోశ్రీరామ పురిపైర్డ్ వాటర్ ఓనర్ కత్రోజ్ అశోక్ సహకారంతో వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా డీఈఓ రమేష్, బస్ డిపో మేనేజర్ మురళీకృష్ణలు బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా బస్ డిపో మేనేజర్ మురళీ కృష్ణ మాట్లాడుతూ బస్సుల్లో ప్రయాణించే వారిదాహార్తి తీర్చడానికి చలివేంద్రం



ప్రారంభించడం అభినందనియని, మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డీఈఓ రమేష్ మాట్లాడుతూ వేసవికాలం లో ప్రయాణికుల కోసం మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగ పడుతుందని, వేసవిలో దాహార్తిని తీర్చడం చాలా ముఖ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, నగుభోతు రవీందర్, గొంగళ్ల రవికుమార్, వొడ్యాల వేణు,తాళ్లపల్లి ప్రశాంత్, పాత సంతోష్, కంట్రోలర్ శ్రీనివాస్ యాదవ్, బస్ పాస్ కౌంటర్ ఇంచార్జి అంజి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య కాలేజీ సిబ్బందిపై కేసు

**రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా నార్సింగి శ్రీచైతన్య కాలేజీలో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్ ఎన్. సాత్విక్ ఆత్మహత్య నేపధ్యంలో మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. కాలేజీకి సంబంధించిన ఆచార్య, కృష్ణారెడ్డి, నరేష్ లపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసారు. సాత్విక్ మంగళవారం రాత్రి క్లాస్ రూమ్ లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కాలేజీలో ఒత్తిడి వల్లే ఆత్మహత్య చేసుకున్నట్టు తోటి స్టూడెంట్స్ ఆరోపించారు. సాత్విక్ ను గమనించి సిబ్బందికి చెప్పినా పట్టించుకోని వారు అంటున్నారు. చివరకు సాత్విక్ ను విద్యార్థులే అసుపత్రికి తరలించారు. అంతలోపే సాత్విక్ మృతి చెందాడు.

## జర్నలిస్టుల పై కేసులు ఎత్తివేయాలి

**విజయవాడ**

తమవృత్తి ధర్మంలోభాగంగా సమాచారాన్ని సేకరించిన జర్నలిస్టుల మీద ఎస్సీ,ఎస్టీ కేసులు పెట్టడం అన్యాయమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు. కదిరిలో జర్నలిస్టులపై ఎస్సీ, ఎస్టీ కేసులు మోపటాన్ని ఏపీ బీజేపీ ఖండిస్తుంది. జర్నలిస్టులపై అక్రమంగా పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలని ఏపీ డీజీపీని డిమాండ్ చేస్తున్నామని అయన అన్నారు.

## పిచ్చికుక్క స్వైర విహారం

**రాయవరం**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గం రాయవరం మండలం కూర్మాపురం గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు భయాందోళనలోవున్నారు. వెంటనే కుక్కలను పట్టించి పిల్లలను పెద్దలను కుక్కలు దాడి నుండి కాపాడుమని కోరుకుతున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది,సంబంధిత మండల అధికారులు వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## జనసైనికుల భద్రత, శ్రేయస్సు...

**ఎమ్మిగనూరు**

బుధవారం జెఎస్పి తాలుకా నాయకులు బి సి నాగరాజు. బుధవారం ఎమ్మిగనూరు పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో జనసేన పార్టీ తాలుకా నాయకులు బి సి నాగరాజు పత్రికా విలేకరులతో మాట్లాడుతూ మార్చి నెల మూడో తారీకు లోపు జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులందరూ జనసేన పార్టీ "క్రియాశీలక సభ్యత్వాన్ని" నమోదు చేయించుకోవాలని సూచించారు, అలాగే రాష్ట్రంలో ఎంతోమంది జనసైనికులు అహర్నిశలు పార్టీ కోసం, ప్రజా సంక్షేమం కోసం, ప్రజాఉద్యమ సారధులుగా పనిచేస్తూ పాటుపడుతున్నారని అలాగే ఎన్నో వ్యయప్రయాసాలు ఓర్చి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న నేపథ్యంలో కొన్ని సందర్భాల్లో వారికి కొన్ని సంఘటనలు చోటు చేసుకుంటూ ప్రమాదాలకు గురౌతూ మరణిస్తున్నారని, అలాగే పార్టీ కార్యకర్తలు అనారోగ్య పరిస్థితుల బారిన పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సందర్భంగా వీటిని దృష్టిలో ఉంచుకొని జనసేన పార్టీ అధినేత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ దేశంలో ఇదివరకు ఏ పార్టీ కూడా చేపట్టని విధంగా పార్టీ కార్యకర్త శ్రేయస్సు, భద్రత వారి కుటుంబాలకు భరోసా లాంటివి దృష్టిలో ఉంచుకొని ఈ "క్రియాశీలక సభ్యత్వ నమోదు" వంటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని పేర్కొన్నారు, దేశంలో ఎన్నో పార్టీలు ఉన్నప్పటికీ కేవలం పార్టీ కార్యకర్తలను, వారి కుటుంబాలను ఒక ఓటు బ్యాంకుగా పరిగణించి వారి సేవలను వినియోగించుకుంటున్నాయని కానీ పార్టీ కార్యకర్తలకు గానీ వారి కుటుంబాలు గానీ ఏమైనా విపత్కర పరిస్థితిలు ఎదురైనా, పార్టీ కార్యకర్తలు మరణించినచో ఎటువంటి భరోసా, భద్రత ఇవ్వలేకపోతున్నాయని తెలిపారు, దేశంలో ఏ పార్టీ కూడా కార్యకర్త భద్రత, శ్రేయస్సు, వారి కుటుంబాలకు సంబంధించిన భద్రతా కోరుకోవడం లేదని, కేవలం పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు భద్రత, శ్రేయస్సు, వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇస్తున్న ఏకైక పార్టీ జనసేన పార్టీ అని, దీనికి శ్రీకారం చుట్టిన ఏకైక వ్యక్తి జనసేన పార్టీ అధినేత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అని పేర్కొన్నారు,

## కంచి కామకోటి పిఠాధిపతికి ఘన స్వాగతం

**విశాఖపట్నం**

రెండు రోజుల ఆధ్యాత్మిక కార్యక్రమాల నిమిత్తం అనకాపల్లి పట్టణానికి విచ్చేసిన కంచి కామకోటి పీఠాధిపతికి అనకాపల్లిలో ఘన స్వాగతం పలికారు.అక్కడనుండి భక్తజనం వెంట రాగా మంగళ వాయిద్యాలు తో కోలాటాలు, తప్పిడి గుళ్ళు, తోడపెద్దు సేవలతో పాదయాత్ర ద్వారా మెయిన్ రోడ్ లో గల శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయానికి చేరుకున్నారు.కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి అనకాపల్లి చేరుకున్నారు. రింగ్ రోడ్డు జంక్షన్ నుంచి శోభయాత్ర నిర్వహించారు. భారీగా భక్తులు తరలివచ్చారు. శ్రీ కన్యాకాపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. ఈసందర్భంగా జయేంద్ర సరస్వతి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.సుంకరమెట్ట జంక్షన్ నుండి సూర్యనారాయణ స్వామి దేవాలయం నుండి శోభాయాత్ర ప్రారంభమవుతుందని ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణకుమార్ తెలియజేశారు.

# మార్చి 9 నుంచి దశల వారీగా ఆందోళన

**విజయవాడ :**

న్యాయమైన డిమాండ్లు, ఆర్థికపరమైన, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు కదం తొక్కేందుకు రెడీ అయ్యారు. ఇప్పటి వరకు ప్రభుత్వంతో సామరస్య పూర్వకంగా చర్చలు జరిపిన ఉద్యోగులు ఇక అమితుమీ తేల్చుకునేందుకు రెడీ అయ్యారు. ఇక తమ నిరసన గళం విప్పాల్సిందేనని డిసైడ్ అయ్యారు. గతంలో సమ్మెకు వెళ్తామని ఉద్యోగ సంఘాలు నోటీసులు ఇచ్చాయి. అయితే సీఎం వైఎస్ జగన్ పలు హామీలు ఇవ్వడంతో అప్పుడు సమ్మెను నిలిపివేశారు. అయితే సీఎం జగన్ ఇచ్చిన హామీలు నేటికి కూడా నెరవేరకపోవడంతో ఇక ఉద్యమ బాట పట్టాల్సిందేనని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఉద్యమ కార్యచరణ ప్రకటించారు. గతంలో మాదిరిగా మంత్రుల ఉప సంఘంతో చాయ్ బిస్కెట్ సమావేశాలు చెల్లవని తేల్చేశారు. ఇక డిమాండ్లు సాధించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఇప్పటికే తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని పదే పదే హెచ్చరించారు. అయినప్పటికీ తమ డిమాండ్ల సాధన విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని బొప్పరాజు ఆరోపించారు. ఇందులో భాగంగా ఈనెల 26న రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేసి ఉద్యమ కార్యచరణకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మంగళవారం ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు సీఎస్ జవహర్ రెడ్డితో భేటీ అయ్యారు. యూనియన్ నేతలతో కలిసి ఉద్యమ నోటీసులు ఇచ్చారు. ఉద్యోగుల ఆర్థికపరమైన, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యమం చేపడుతున్నట్టు నోటీసుల్లో పేర్కొన్నారు.మార్చి 9 నుంచి ఉద్యమ కార్యాచరణ షురూ అవుతుందని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రకటించారు. సీఎస్ జవహర్ రెడ్డితో భేటీ అనంతరం బొప్పరాజు వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులంతా తమ డిమాండ్ల సాధనకు ఆందోళన బాటపట్టాలని పిలుపునిచ్చారు. ముందుగా సెల్ డౌన్, పెన్ డౌన్, భోజన విరామ సమయాలలో నిరసన గళం వినిపించాలని సూచించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కలెక్టరేట్లలో స్పందన దరఖాస్తులు ఇవ్వాలని స్పష్టం చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం స్పందించకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని బొప్పరాజు వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈసారి చాయ్ బిస్కట్ సమావేశాలతో రాజీపడే ప్రసక్తేలేదని .పోరును ఉధృతం చేస్తామని.. తమ డిమాండ్లు సాధించుకునేందుకు వెనుకాడేది లేదని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రకటించారు.

# అమరావతి భూములపై లోతుగా విచారణ

**విజయవాడ :**

అమరావతి రాజధాని భూముల కేసులో మాజీ మంత్రి, టీడీపీ నేత నారాయణకు సీఐడీ మరోసారి నోటీసులు ఇచ్చింది. నారాయణకు 41ఏ సీఆర్పీసీ కింద నోటీసులు జారీచేసింది. మార్చి 6న సీఐడీ ముందు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. నారాయణతో పాటు ఆయన భార్య రమాదేవితో పాటు నారాయణ సంస్థలో ఉద్యోగి ప్రమీల, రామకృష్ణ హౌసింగ్ ఎండీ అంజనీకుమార్, నారాయణ కుమార్తెలు సింధూర, శరణి, అల్లుళ్లు పునీత్, వరుణ్‌కు కూడా సీఐడీ నోటీసులు ఇచ్చింది. మార్చి 7న లేదా 8వ తేదీన విచారణకు రావాలని నారాయణ కుమార్తెలకు నోటీసులు ఇచ్చింది ఏపీ సీఐడీ.రాజధాని భూముల వ్యవహారంలో ఏపీ సీఐడీ హైదరాబాద్ లో సోదాలు నిర్వహిస్తుంది. రాజధాని మాస్టర్ ప్లాన్ అవకతవకల విషయంలో సోదాలు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కూకట్‌పల్లి, గచ్చిబౌలి, కొండాపూర్‌లో ఉన్న నారాయణ కుటుంబ సభ్యుల ఇళ్లలో సీఐడీ సోదాలు చేస్తుంది. ఇప్పటి వరకు మాజీ మంత్రి నారాయణపై ఏపీ సీఐడీ అధికారులు పలు కేసులు పెట్టారు. పదోతరగతి పరీక్షాపత్రం లీకేజీతో పాటు, రాజధాని భూములకు సంబంధించి కేసులు నమోదు చేసింది సీఐడీ.అమరావతి భూముల కేసులో సీఐడి మరోసారి విచారణ వేగవంతం చేసింది. మాజీ మంత్రి నారాయణ కుమార్తె ఇంట్లో సోదాలు చేస్తోంది. హైదరాబాద్‌లోని నివాసం ఉంటున్న ఆమె ఇంట్లో సీఐడీ అధికారులు ఇటీవల తనిఖీలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రకటించడంతో అప్పటి మంత్రిగా ఉన్న నారాయణ అక్రమాలకు పాల్పడ్డారని వైసీపీ ప్రభుత్వం అనుమానిస్తోంది. అందుకే సీఐడీ విచారణ చేస్తోంది. విచారణలో భాగంగా సీఐడీ అధికారులు గతంలోనే నారాయణతోపాటు పలువురు ఇళ్లలో తనిఖీలు చేశారు ఇప్పుడు నారాయణ కుమార్తె ఇంట్లో తనిఖీలు చేశారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, కొండాపూర్, గచ్చిబౌలిలో ఉన్న ఆమె ఇళ్లలో సోదాలు చేస్తున్నారు అధికారులు. అమరావతి భూముల కేసులో కీలక మలుపు తిరిగే ఛాన్స్ ఉన్నట్టు కనిపిస్తోంది. నారాయణ కుమార్తె ఇంట్లో సోదాలు చేసిన సీఐడీ అధికారులు కీలక ఆధారాలు సేకరించినట్టు సమాచారం. నారాయణ, తన కుమార్తెతో మాట్లాడిన ఆడియో క్లిప్ లభించినట్టు తెలుస్తోంది. దీని ఆధారంగా కేసును ముందుకు తీసుకెళ్లాలని సీఐడీ భావిస్తోంది. అమరావతిలో అసైన్డ్ ల్యాండ్స్ అమ్మకాలు , కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయంటూ 2020లో సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో చంద్రబాబు, నారాయణ పేర్లను కూడా చేర్చారు. ఆ కేసుపై తాజాగా గతేడాది ఐదుగుర్ని అరెస్ట్ చేశారు. రాజధాని అసైన్డ్‌భూముల వ్యవహారంలో వైసీపీ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ పోలీసులు చంద్రబాబు, నారాయణలపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంతోపాటు ఏపీ అసైన్డ్ భూముల చట్టం, ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. దర్యాప్తునకు రావాలంటూ నోటీసులు అందజేశారు. దీనిపై కోర్టు స్టే ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలంటే దళితులే ఫిర్యాదు చేయాలి. కానీ థర్డ్ పార్టీ కింద కేసు నమోదు చేశారు. అప్పుడే ఈ అంశంపై దుమారం రేగింది.

# 15 వేల మెగా వాట్ల విద్యుత్ వినియోగం

**హైదరాబాద్ :**

రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైంది. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు 14,794 మెగా వాట్ల విద్యుత్ వినియోగం అయింది. గతేడాది మార్చిలో 14,160 మెగా వాట్ల అత్యధిక విద్యుత్ వినియోగం కాగా..ఈ సారి డిసెంబర్ లోనే ఆ రికార్డ్ ను అధిగమించి 14,501 మెగా వాట్ల విద్యుత్ నమోదే ఇప్పటి వరకు రికార్డ్ గా ఉంది. మంగళవారం అత్యధికంగా 14,794 మెగా వాట్ల విద్యుత్ వినియోగించడంతో కొత్త రికార్డ్ నమోదైంది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి తెలంగాణలో తొలిసారిగా రికార్డ్ స్థాయిలో ఇవాళ విద్యుత్ డిమాండ్ నమోదు కావటం విశేషమని ట్రాన్స్ కో సీఎండీ ప్రకటించారు. సాగు విస్తీర్ణం పెరగడం, రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలు పెరగడంతో విద్యుత్ వినియోగం పెరుగుతోందని ట్రాన్స్ కో అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం విద్యుత్ వినియోగంలో సౌత్ లో తమిళనాడు మొదటి స్థానంలో ఉండగా తెలంగాణ రెండో స్థానంలో ఉంది. మొత్తం విద్యుత్ వినియోగంలో 37 శాతం వ్యవసాయ రంగానికే వాడుతున్నారు. దేశంలో వ్యవసాయ రంగానికి అత్యధిక విద్యుత్ వినియోగిస్తున్న రాష్ట్రం తెలంగాణ . డిమాండ్ ఎంత వచ్చినా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు



అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. రాబోయే రోజుల్లో కరెంటు వినియోగానికి మరింత డిమాండ్ ఉండే అవకాశం ఉందని ట్రాన్స్‌కో అధికారులు భావిస్తున్నారు.పెరిగిన సాగు విస్తీర్ణం, పారిశ్రామిక అవసరాల వల్ల డిమాండ్‌కు కారణాలు పేర్కొంటున్నారు. అయితే, మొత్తం విద్యుత్ వినియోగంలో వ్యవసాయానికే 37శాతం వినియోగిస్తున్న రాష్ట్రంగా నిలిచిందని అధికారులు తెలిపారు. ఇంతకు ముందు వ్యవసాయానికే కేవలం 35శాతమే వినియోగించే వారని పేర్కొంటున్నారు. వేసవికాలం సమీపిస్తుండడంతో డిమాండ్ పెరిగి 37శాతానికి పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. తెలంగాణవ్యాప్తంగా పంటలకు నీటిని అందించడం పెరిగిందని, అలాగే ఉద్యాన పంటలకు సైతం నీటి వాడకం ఎక్కువైందని అధికారులు అంచనా వేస్తున్నారు. బోరుబావులపైనే ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో విద్యుత్ డిమాండ్ ఎక్కువైందని అధికారులు పేర్కొంటున్నారు. రబీ సీజన్‌లో దాదాపు 16వేల మెగావాట్లకుపైగా డిమాండ్ వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. డిమాండ్ ఎంత వచ్చినా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు. కరెంట్ కోతలు అనేవి తెలంగాణలో ఉండకూడదని ప్రభుత్వంకూడా పట్టుదలగా ఉంది.

## ఊపందుకున్న ఎమ్మెల్సీ టీడీపీ ప్రచారం

**కౌతాళం**

వైసీపీ ప్రభుత్వంలో సైకో పాలన నడుస్తుందని అరాచకాలకు, అవినీతి పాలనకు అడ్డగోలుగా నిలుస్తున్నారని మీ మీ ఓటుతో ప్రతి యువత సమాధానం చెప్పాలని తెలుగు దేశం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, మరియు క్లస్టర్ ఇంచార్జ్ వెంకటపతి రాజు పేర్కొన్నారు. గ్రామంలో 176 అభ్యర్థులను కాలనీలో ఎమ్మెల్సీ ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇంచార్జ్ తిక్క రెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశంపార్టీ నాయకులతో కలసి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించరు. కార్యక్రమంలో మాట్లాడుతూ. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మొదటి ప్రాధాన్యతగా (1) ఓటు వేసి ఆశీర్వదించాలని సూచించారు. భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి గెలిపించుకుంటే మనకి మొదటి విజయంగా భావించాలని అన్నారు, వైసిపి ప్రభుత్వము లో సైకో పాలనలో రాష్ట్రంలో శాంతి లేదని..., సామాన్య ప్రజలకు, మహిళలకు భద్రత లేదని.., అరాచక రాజ్యం కొనసాగుతుందని ఓటర్ లకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటపతి రాజు, కాశీ విశ్వనాథ్ డాక్టర్ రాజనంద్, ఐటీడీపీ ఉపాధ్యక్షులు మంజునాథ్, సిద్దు తదితరులు నాయకులు ఉన్నారు.

## పోలీసు వాహనాల ప్రారంభం

**విశాఖపట్నం**

అర్ముడ్ రిజర్వు ఆఫీస్ వద్ద విశాఖ నగర పోలీసు కమిషనర్ సిహెచ్. శ్రీకాంత్, జి. వి. ఎం. సి. కమిషనర్ పి. రాజాబాబులు రెండు వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు మరింత సమర్ధవంతమైన సేవలు అందించడానికి ఈ వాహనాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నా రు. బీచ్ పెట్రోలింగ్, క్యూఆర్టీ వెహికల్స్గా గాను వీటిని ఉపయోగిస్తామని చెప్పారు. జీవీఎంసీ, విస్కో సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి లక్షల రూపాయలు విలువైన వాహనాలను పోలీసు శాఖకు అందించడంపై సీపీ హర్షం వ్యక్తం చేశారు.

## పేలిన రియాక్టర్..ఇద్దరు మృతి

**రంగారెడ్డి**

జీడిమెట్లలోని ఆరోరా ఫార్మాసూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లో అగ్నిప్రమాదం జరిగింది. కెమికల్ ల్యాబ్లో పని చేస్తున్నప్పుడు రియాక్టర్ పేలి ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ల్యాబ్లో పనిచేస్తున్న రవీందర్ రెడ్డి(25), కుమార్ (24) అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే చనిపోయారు. మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసుకున్న జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తిమ్మాపురం ఆలయంలో సీఎం కేసీఆర్

**బాన్సువాడ**

బాన్సువాడ తిమ్మాపురంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం లె సీఎం కేసీఆర్ బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. ముందుగా అయన "అలిపిరి" వద్ద దేవాలయ పైలాన్ ను ఆవిష్కరించారు. సీఎం కేసీఆర్ దంపతులను దేవస్థాన పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబం చేయించిన రెండు కిలోల స్వర్ణ కిరీటాన్ని స్వామి వారికి సీఎం కేసీఆర్ దంపతులు బహుకరించారు. వేద పండితులు సిఎం దంపతులకు ఆశీర్వచనము ఇచ్చారు.

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ దంపతులను స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి దంపతులు పట్టువస్త్రాలతో సన్మానించారు. వేంకటేశ్వర దేవాలయం తరపున స్పీకర్ పోచారం సీఎం కేసీఆర్ కు జ్ఞాపికను అందజేశారు. అనంతరం మొక్క నాటారు.

ఈ కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీలు సురేష్ రెడ్డి, జోగినపల్లి సంతోష్ కుమార్, బి.బి.పాటిల్, టిఎస్ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యేలు జాజుల సురేందర్, గంప గోవర్ధన్, గణేష్ బిగాల, డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానస్పద స్థితిలో వివాహిత మృతి

**మదనపల్లె**

మదనపల్లె పట్టణంలోని ఎన్వీఆర్ లేఔట్ నందు ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఆమె గృహం వద్ద ఆందోళన చేపట్టారు. బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్వీఆర్ లేఔట్ నందు భార్యాభర్తలు ఛాయ, నాగేంద్ర కాపురం ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఛాయ పట్టణంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఆమె ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని భర్త ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతురాలి కుటుంబ సభ్యులు భర్తే ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. మదనపల్లె రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుమలలో ఫేషియల్ రికగ్నైజేషన్

**తిరుమల :**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో భక్తులకి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తోన్న తిరుమల తిరుపతి దేవస్థానం. మరో కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమలకు వచ్చే భక్తులకు గదుల కేటాయింపు.. కాషన్ డిపాజిట్ తిరిగి చెల్లించే కౌంటర్ల ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ అమలు చేయనుంది. బుధవారం నుంచే ఈ విధానాన్ని ట్రైల్ ఫేజ్ లో ప్రారంభించింది. తిరుమల శ్రీవారి సర్వదర్శనం, లడ్డూప్రసాదం, గదుల కేటాయింపు, రీఫండ్ చెల్లింపు అంశాల్లో మరింత పారదర్శకత పెంచేందుకు వీలుగా బుధవారం నుంచి తిరుమలలో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీని టీటీడీ ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. తిరుమలలో ఉన్న గదుల కేటాయింపు కౌంటర్లు, కాషన్ డిపాజిట్ తిరిగి చెల్లించే కౌంటర్ల వద్ద ఈ పరిజ్ఞానం ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తారు. రెండవ వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి టోకెన్లు లేకుండా సర్వదర్శనానికి వెళ్ళే భక్తులకు కూడా ఈ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి లడ్డూలు జారీ చేస్తారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల తలనీలాలు తీసే క్షురకులు.... ఇన్ఫెక్షన్లు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తిరుపతికి చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ కృష్ణప్రశాంతి సూచించారు. తిరుమల ఆస్థాన మండపంలో కళ్యాణకట్ట క్షురకులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణప్రశాంతి మాట్లాడుతూ క్షురకులు భక్తులకు చాలా దగ్గరగా ఉండి సేవలందిస్తారని... కావున మాస్కులు ధరించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రధానంగా ఊపిరితిత్తులు, వెంట్రుకలు, ముక్కు ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉందన్నారు. వీటిని నివారించేందుకు లోషన్ తో ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకోవాలని, చేతులకు తడి లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎక్కువసేపు కూర్చొని పని చేయాల్సి రావడం వల్ల మోకాలి నొప్పి, నడుము నొప్పి రాకుండా గంటకోసారి ఐదు నిమిషాలు లేచి నడవాలని డాక్టర్ ప్రశాంతి సూచించారు. విధులు ముగిసిన తర్వాత ప్రతి ఒక్కరూ మెడ, భుజాలకు సంబంధించిన వ్యాయామం చేయాలని చెప్పారు. అనంతరం పలువురు క్షురకులు అడిగిన అనారోగ్య సమస్యలకు పరిష్కారాలను తెలియజేశారు.

# సిటీలో రెడీ అవుతున్న స్కైవాక్

**హైదరాబాద్ :**

హైదరాబాద్ ట్రాఫిక్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రోడ్డు దాటడం అంటే సాహసించాల్సిందే. ఇప్పటికే ఎంతో మంది రోడ్డు దాటుతూ తమ ప్రాణాలను పోగొట్టుకున్నారు. రోజు నగరంలో ఏదో ఒక ప్రాంతంలో రోడ్డు దాటుతున్న పాదాచారులు ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. వీటిని కట్టడిచేసేందుకు ప్రభుత్వం, హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కొత్త మార్గాలను అన్వేషించింది. నగరంలో రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ల మాదిరిగా స్కై వాకులను నిర్మించాలని నిర్ణయించింది. అనుకున్నదే తడవుగా నిర్మాణం చేపట్టింది. రద్దీ ఎక్కువగా ఉండే మెహిదీపట్నంలో నిర్మాణమవుతున్న స్కైవాక్ ఈ ఏడాది మే నెలలో అందుబాటులోకి రానుంది. 11 ఎలివేటర్లతో 390 మీటర్ల పొడవుతో ఈ స్కైవాక్ నిర్మిస్తున్నారు. హెచ్ ఎండీఏ రూ. 32.97 కోట్లతో ఈ స్కైవాక్ నిర్మిస్తోంది. మొత్తం 390 మీటర్ల పొడవులో మెహిదీపట్నం బస్టాండ్ నుంచి డిఫెన్స్ సరిహద్దు వరకు 50 మీటర్లు, మెహిదీపట్నం నుంచి రైతు బజార్, ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ వరకు ఇంటర్మీడియట్ టన్నెల్ వాక్ 160 మీటర్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మెహిదీపట్నం నుంచి మల్లేపల్లి రోడ్డు వరకు 180 మీటర్లు పొడవునా వాక్ వే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ ఎత్తు 6.15 మీటర్లుగా ఉండగా.. వెడల్పు నాలుగు నుంచి ఐదు మీటర్లతో నిర్మిస్తున్నారు. రైతు బజార్, డిఫెన్స్ కాంపౌండ్ వాల్, మెహిదీపట్నం బస్ బే ఏరియా, అసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్, గుడిమల్కాపూర్ సమీపంలో రేమండ్ షోరూమ్ దగ్గర ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు పెడుతున్నారు. స్కైవాక్‌లో కాఫీ షాప్‌లు, స్నాక్స్, ఇతర షాపుల కోసం స్థలాన్ని కేటాయించనున్నారు. అలాగే ఎల్ఈడీ స్ట్రిప్ లైట్లను ఏర్పాటు చేయనున్నారు. స్కైవాక్ వల్ల పాదచారులకు మరింత భద్రత ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఖం నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేకి ఆనుకుని ఈ స్కైవాక్‌ను నిర్మిస్తున్నారు. అలాగే ఉప్పల్ జంక్షన్ వద్ద కూడా స్కైవాక్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రూ. 35 కోట్ల వ్యయంతో ఇది రూపుదిద్దుకుంటుండగా.. త్వరలోనే ఇది కూడా అందుబాటులోకి వచ్చే అవకాశముందని తెలుస్తోంది. 660 మీటర్ల స్కైవాక్ ఉప్పల్ జంక్షన్ నాలుగు వైపులా కలుపుతుంది. అంతేకాకుండా మెట్రో స్టేషన్‌తో కాంకోర్స్ లెవల్, బస్-స్టాప్‌లు, వాణిజ్య సంస్థలతో అనుసంధానించబడి ఉంది. స్కైవాక్‌లో ఆరు ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లు ఉన్నాయి. నాగోల్ రోడ్ వైపు మెట్రో స్టేషన్, రామాంతపూర్ రోడ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ థీమ్ పార్క్, జీహెచ్ఎంసీ కార్యాలయం సమీపంలోని వరంగల్ బస్ స్టాప్, ఉప్పల్ పోలీస్ స్టేషన్, ఉప్పల్ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రహదారి హాప్-ఆన్ స్టేషన్లుగా ఉన్నాయి. స్కైవాక్‌లో అనేక సౌకర్యాలు ఉన్నాయి, వీటిలో ఎనిమిది లిఫ్టులు, నాలుగు ఎస్కలేటర్లు, ఆరు మెట్లు దారులున్నాయి. సాంప్రదాయక స్కైవాక్‌ల కాకుండా ఒక చివర నుండి మరొక చివరకి వెళ్లేందుకు వీలు కల్పిస్తాయి. వెడల్పు 3 మీటర్ల నుండి 4 మీటర్లు, కొన్ని స్ట్రెచ్‌లలో 6 మీటర్ల వరకు ఉబ్బెత్తుగా ఉంటుంది. మొత్తం ఎత్తు 9.25 మీటర్లు. నిర్మాణం గురించి హెచ్ఎండీఏ ఇంజనీర్లు మాట్లాడుతూ, పునాది రీన్‌ఫోర్స్ సిమెంట్ కాంక్రీట్ అని, స్తంభాలు, డెక్ స్టీల్‌తో ఉన్నాయని చెప్పారు. స్కైవాక్ ఉప్పల్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు పాదచారుల భద్రతను పెంచుతుందని భావిస్తున్నారు.

# హ్యాట్రిక్ మిస్సవుతారా....



**హైదరాబాద్ :**

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ముచ్చటగా మూడవ సారి ముఖ్యమంత్రి అవుతారా? బీఆర్ఎస్ నాయకులు ఏ ఇద్దరు కలసిన ఇదే విషయం చర్చకు వస్తోంది. నిజానికి సర్వేలు ఏమి చెపుతున్నప్పటికీ, ఎన్నికలు ఎప్పుడు జరిగినా, బీఆర్ఎస్ కు సంపూర్ణ మెజారిటీ వచ్చినా రాకున్నా కాంగ్రెస్ సహకారంతో మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని కొందరు నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ కు సంపూర్ణ మెజారిటీ వస్తే మాత్రం కేసీఆర్ హ్యాట్రిక్ మిస్సవుతారని బీఆర్ఎస్ నాయకులు అంటున్నారు. అవును బీఆర్ఎస్ కు సంపూర్ణ మెజారిటీ వస్తే, కేసీఆర్ స్థానంలో కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, కేసీఆర్ జాతీయ రాజకీయాలకు పరిమితం అవుతారని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితిలో బీఆర్ఎస్ కు పూర్తి మెజారిటీ వచ్చే అవకాశాలు అంతగా లేవని, అదుకే 2014లో వచ్చిన అత్తెసరు మెజారిటీ కూడా ఈసారి రాక పోవచ్చని అంటున్నారు. అదుకే, కేటీఆర్ లో అసహనం పెరుగుతోందని మరికొందరు విశ్లేషిస్తున్నారు. ఈ మధ్య కాలంలో కేటీఆర్ ఎక్కడ మాట్లాడినా, విపక్షాల మీద విరుచుకు పడుతున్నారుముఖ్యంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ టార్గెట్ గా కేటీఆర్ చేస్తున్న విమర్శలు శృతి మించుతున్నాయని విమర్శకులు అంటున్నారు. చివరకు ప్రధాని మోడీని, తెలంగాణకు పట్టిన శని అనే స్థాయిలో విమర్శించారు. అదే విధంగా రేవంత్ రెడ్డి చేస్తున్న పాదయాత్రను ఉద్దేశించి, కొందరు పనికిమాలిన పాదయాత్రలు చేస్తున్నారని విమర్శించారు. ఒక్క ఛాన్స్ ఇవ్వండని అంటున్నారని, యాభై ఏళ్లు అధికారంలో ఉండి ఏం పీకారని దుయ్యబట్టారు. అలాగే వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీకి చెందిన పీజీ మొదటి సంవత్సరం విద్యార్థిని ప్రీతి మరణం ఘటనను రాజకీయం చేస్తున్నారని విపక్షాలను తప్పుబట్టారు. ప్రీతిని హత్య చేసిన వారిని వదిలిపెట్టమని స్పష్టం చేశారు. తప్పు చేసిన వారు సైఫ్ అయినా సంజయ్ అయినా ఎవరినీ వదలమని కేటీఆర్ హెచ్చరించారు. ఇది ఆయనలో అసహనానికి నిదర్శనం కావచ్చునని బీఆర్ఎస్ నాయకులే అంటున్నారు. సీఎం కుర్చీ దూరమౌతోందన్న భావనతోనే ఆయన విమర్శలు శృతి మించుతున్నాయని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

# రెచ్చిపోతున్న భూ మాఫియా...

**నిజామాబాద్ :**

నిజామాబాద్ నగరంలో భూ మాఫియా రెచ్చిపోతోంది. కోట్ల రూపాయల విలువ చేసే భూమిపై కన్నేసి నకిలీ పట్టాలు సృష్టించిన ఘనుల బాగోతాలు బైటపడుతున్నాయి. ఇప్పటికే ఈ వ్యవహారంలో పోలీసులు 12 మందిపై కేసు నమోదు చేశారు. నిజామాబాద్ కొత్త కలెక్టరేట్ సమీపంలోని బైపాస్ రోడ్డు 7 ఎకరాల భూమి వారసులులేని ఈ జాగాపై కన్నేసింది భూ మాఫియా. ఇందులో రిజిస్ట్రేషన్, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులతో పాటు ప్రముఖ రాజకీయ నాయకులు ఉన్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లుగా తెలిసింది. టాస్క్ ఫోర్స్ పోలీసులతో పాటు నిజామాబాద్ టౌన్ పోలీసులు పకడ్బందీ విచారణ చేపడుతున్నారు. ఈ వ్యవహారం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. నకిలీ పట్టాల వ్యవహారంపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఈ కోట్లాది రూపాయల భూమాఫియా వెనుక ఓ రాజకీయనేతతో పాటు కీలకమైన వ్యక్తులు మరి కొందరున్నారు. తెరవెనుక కథ నడిపింది రిజిస్ట్రేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖకు చెందిన అధికారులున్నారని విచారణలో తేలింది. ఇదివరకే పలు ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ అయిన రిజిస్ట్రేషన్ అధికారితో పాటు మరొకరు కాగా, దొంగ ఇంటి నంబర్లు ఇచ్చిన మున్సిపల్ అధికారి మరొకరు కీలకపాత్ర పోషించినట్లు పోలీసుల విచారణలో తె?లింది. వీళ్ళతో పాటుగా నకిలీ పట్టాల సృష్టిలో రెవిన్యూ అధికారి ఒకరు అన్నీతానై నడిపినట్లు సమాచారం. నాలుగు మీ సేవా కేంద్రాల్లో పెద్ద ఎత్తున నకిలీ పట్టాలు తయారు చేసినట్లుగా పోలీసులు నిర్ధారించినట్లు తెలిసింది. కంటేశ్వర్, రైల్వే స్టేషన్ సమీపంలో, బోర్గాం, మున్సిపల్ సమీపంలోని మీ సేవ కేంద్రాల్లో నకిలీ పట్టాలకు అడ్డాలుగా గుర్తించారు. మీ సేవ నిర్వహకులపై కూడా కేసులు నమోదు చేయనున్నట్లు తెలిసింది. నకిలీ పట్టాలు తయారు చేసే ముఠాను ఓ వ్యక్తి ఫిర్యాదుతో నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలుపుతున్నారు. ఈ ఫేక్ డాక్యుమెంట్ కేసులో ఎ-1 అమర్ సింగ్, ఎ-2 సుదర్శన్ లను పోలీసులు అరెస్టు చేశారు. ఎ-3, ఎ-4లు దేవేందర్, భూమారెడ్డిలు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరితో పాటు ఇంకా 8 మందిని పోలీసులు నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. ప్రైవేట్ భూమి అయినా ప్రభుత్వ భూమి అయినా యథేచ్ఛగా నకిలీ పట్టాలు సృష్టిస్తూ... కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు భూ మాఫియా. నిజామాబాద్ జిల్లాలో ఈ ఫేక్ డాక్యుమెంట్స్ భాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఇందులో రెవెన్యూ అధికారులు కూడా సహకరిస్తుండటంతో ... భూ మాఫియాకు పని మరింత సులువవుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయ్. ఓల్డ్ స్టాంపులు ఎక్కడి నుంచి వస్తున్నాయి. సంతకాలు ఫోర్జరీ ఎలా జరిగింది. గతంలో పనిచేసిన ఎమ్మార్వోలను ఆశ్రయిస్తూ... వారితో సంతకాలు చేయించుకుని మరీ ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టిస్తూ... అమాయకుల భూములను కబ్జాకు పాల్పడుతున్న వైనం వెలుగు చూస్తున్నాయి. మరోవైపు పోలీసులు ఈ నకిలీ పట్టాల వ్యవహారంపై లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో ఇంకా ఎవరెవరి పాత్ర ఉంది. ఓ ప్రజా ప్రతినిధి హస్తం కూడా ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కొందరు పోలీసులు కూడా తక్కువ ధరకే భూములు వస్తున్నాయన్న ఆశతో నకిలీ పట్టాల భూములను కొన్నట్లుగా కూడా ప్రచారం జరుగుతోంది. నిజామాబాద్ నగరంలోని నాగారంలో కూడా ప్రభుత్వం పేదలకు బీపీఎల్ కింద ఇచ్చిన భూములను సైతం నకిలీ పట్టాలు సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్న వైనం నేటికీ జరుగుతోంది. చాలా మంది బాధితులు ఇప్పటికీ ప్రజావాణిలో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోతోంది. ఒక్కో పట్టా మీద 3 నుంచి 4 నకిలీ పత్రాలు సృష్టిస్తూ అమ్ముతున్నారు. తీరా విషయం తెలిశాక బాధితులు లబోదిబోమంటున్నారు. గతంలో ఎమ్మార్వో ఆఫీస్ లో ప్రభుత్వ భూములకు సంబంధించిన ఫైల్స్ అగ్నిప్రమాదానికి గురై తగలబడిపోయాయ్. దీంతో కొందరు భూ మాఫియా నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ భూముల వివరాలు తెలుసుకుని నకిలీ పత్రాలు సృష్టిస్తూ... భూములను అక్రమంగా అమ్మేసిన ఘటనలు కోకొల్లలు అనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఈ నకిలీ పట్టాల ముఠాల ఆట కట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిజామాబాద్ నగర వాసులు కోరుతున్నారు.

# బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్

**హైదరాబాద్ :**

దేశంలో దర్యాప్తు సంస్థలను రాజకీయ పక్షాలపై కక్ష తీర్చుకోడానికి ... అవినీతి పరులైన నేతల్ని పార్టీలో చేర్చుకునేందుకు ఉపయోగించుకుంటున్నారని విపక్షాలు చాలా కాలంగా కేంద్రంపై ఆరోపణలు చేస్తున్నాయి. తాజాగా ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను అరెస్ట్ చేయడంతో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్.. 'ఈక్వాలిటీ బిఫోర్ లా..?' అనే శీర్షికతో కొంత మంది జాబితాను ట్వీట్ చేశారు. వారంతా బీజేపీలో చేరక ముందు తీవ్ర కేసులు ఎదుర్కొన్న వారు. బీజేపీలో చేరిన తర్వాత వారిపై విచారణలు ఆగిపోయాయి. మహారాష్ట్రలో నారాయణ్ రాణే, పశ్చిమబెంగాల్‌లో సువేంధు అధికారి, అసోంలో హిమాంత బిశ్వశర్మ తదితర నాయకులను కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి మోదీ సర్కారు ఎలా దారికి తెచ్చుకున్నదో అందులో వివరించారు. దానికి 'హౌ ద మోదీ గవర్నమెంట్ మిస్ యూజెస్ ద ఏజెన్సీస్ టు టాపిల్ గౌట్స్, ఇండ్యూస్ డిఫెక్షన్స్ అండ్ హరాస్ అప్పొజిషన్' అనే క్యాప్షన్ ఇచ్చారు. ఆ ట్వీట్ లో నారాయణ్ రాణే 300 కోట్ల మనీ ల్యాండరింగ్ కేసులో ఇరుకుంటే ఆయన బిజెపి తీర్థం పుచ్చుకున్నారు.. వెంటనే దానిపై విచారణ నిలిచిపోయింది.. నారద స్కామ్ లో చిక్కుకున్న పశ్చిమబెంగాల్ నేత సువేంధు అధికారి కమలంలో చేరిన వెంటనే ఆ కేసు ఎటో వెళ్లిపోయిందన్నారు. లంచం కేసులో చిక్కుకున్న అసోం నేత హిమాంత భిశ్వశర్మ బెజెపి గూటికి చేరడంతో ఆ కేసు అటకెక్కింది. మహారాష్ట్ర శివసేన లీడర్, ఎంపి గౌలి అవినీతి కేసులో అయిదుసార్లు సమన్లు వచ్చిన సందర్భంలో ఆయన షిండే శిబిరంలో చేరిపోయారు.. ఆ కేసు గురించి ఆలోచించడమే మానివేశారు.. యశ్వంత్ జాదవ్ దంపతులు కషాయం కప్పుకోవడతో వారి కేసులు మాఫీ అయిపోయాయి.. అంటూ ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. ఆ ట్విట్ ను కెటిఆర్ రీ ట్విట్ చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు తెలంగాణపైనా గురి పెట్టాయన్న ప్రచారం జరుగుతోంది. పెద్ద ఎత్తున ఐటీ దాడులు జరుగుతున్నాయి. ఈ సమయంలో .. కేటీఆర్.. కేంద్ర దర్యాప్తు సంస్థల్ని రాజకీయంగా ఎలా ఉపయోగించుకుంటున్నారో వివరించేలా ఉన్న ఈ ట్వీట్‌ను.. తన ఖాతాలోకి షేర్ చేసుకోవడంతో.. బీఆర్ఎస్ క్యాడర్.. ఈ ట్వీట్‌ను వైరల్ చేస్తోంది.

# 40 కోట్లు బూడిదలో పోసిన పన్నీరేనా

**కరీంనగర్ :**

మానేరు నదిపై పొంతన లేకుండ వంతెన నిర్మాణం చేయడంతో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మాణం చేసిన వంతెన అందుబాటులోకి రాకుండ పోయింది. బీఆర్?ఎస్? పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వెనక ముందు చూసుకోకుండా చేపట్టిన పనులతో కోట్ల రూపాయాల ప్రజాధనం వృధా అవుతుందని ప్రతిపక్ష పార్టీలు నిత్యం దుమ్మెత్తి పోస్తున్నాయిప్రతిపక్షాల ఆరోపణలు నిజం చేస్తూ పెద్దపల్లి జిల్లాలో రూ. 40.20 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావడానికి రూ. 20 కోట్లతో మరో వంతెన నిర్మాణం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. బ్రిడ్జిపై నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగించాలంటే ఇప్పుడు ఆర్?ఓబీ తప్పని సరి కావడంతో అధికారులు ప్రతిపాదనలు సిద్దం చేసి సర్కార్?కు పంపించారు. పెద్దపల్లి ? కరీంనగర్? జిల్లాలకు సరిహద్దుగా ఉన్న మానేరు నదిపై పలు చోట్ల బ్రిడ్జిల నిర్మాణం చేసి రెండు జిల్లాల గ్రామాలకు వెళ్లే దూర భారం తగ్గించాలని అనేక సంవత్సరాలుగా ప్రజలు కోరుకుంటున్నారు. బ్రిడ్జిల నిర్మాణం కోసం గ్రామాలకు వచ్చిన పలువురి నేతలకు వినతి పత్రాలు సమర్పించారు. చివరకు 2014లో ప్రస్తుత బీఆర్?ఎస్? అప్పటి టీఆర్?ఎస్? పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్? మండలంలోని నీరుకుల్ల, కరీంనగర్? జిల్లాలోని మానకొండూర్? మండలం వేగురుపల్లి గ్రామాల మధ్య మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణం సర్కార్? నిధులు కేటాయించింది. రూ. 40.20 కోట్ల అంచనాతో 2016 జనవరిలో పనులు ప్రారంభించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి అయి దాదాపు మూడేళ్లు దాటింది. మూడేళ్లు దాటిన మానేరు బ్రిడ్జి ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఇందుకు కారణం ఆఫీసర్లకు ముందు చూపు లేకుండా బ్రిడ్జి నిర్మాణం చేయడమే ప్రధాన కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మానేరుపై కొత్తగా కట్టిన బ్రిడ్జి అందుబాటులోకి రావాలంటే ఇప్పుడు నీరుకుళ్ల సమీపంలో రూ. 20 కోట్లతో ఆర్?ఓబీ (రైల్వే ఓవర్? బ్రిడ్జ) నిర్మాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మానేరు నదిపై పెద్దపల్లి, కరీంనగర్? జిల్లాలను కలుపుతూ నీరుకుళ్ల, వేగురుపల్లి గ్రామాల మధ్య కట్టిన బ్రిడ్జికి రెండు వైపుల ఆప్రోచ్? రోడ్డు నిర్మాణం పెద్ద సమస్యగా మారింది. మానేరు నదిపై రూ. 40కోట్లతో కట్టిన బ్రిడ్జి విషయంలో ఆఫీసర్లు, లీడర్లకు ముందు చూపులేకుండనే నిర్మాణం చేపట్టారు. బ్రిడ్జిపై నుంచి వాహనాల రాకపోకలు సాగించాలంటే బ్రిడ్జి వరకు ఆప్రోచ్? రోడ్డు తప్పని సరి. మానకొండూర్? మండలంలోని వేగురుపల్లి గ్రామం నుంచి మానేరు వరకు సుమారుగా కిలో మీటర్ల ఆప్రోచ్? రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. ఆప్రోచ్? రోడ్డు కోసం భూసేకరణ చేసిన ఆఫీసర్లు నిర్వాసితులకు డబ్బులు చెల్లించకపోవడంతో ఆప్రోచ్? రోడ్డు పనులను స్థానికులు గతంలో అడ్డుకున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయిప్పటికీ ఇప్పటికీ వేగురుపల్లి వైపు ఆప్రోచ్? రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. మానేరు బ్రిడ్జి దాటిన తరువాత నీరుకుళ్ల మీదుగా రాజీవ్? రహదారికి వాహనాలు రావాలంటే పెద్దపల్లి? నిజామాబాద్? రైల్వే లైన్? ప్రధాన అడ్డంకిగా మారింది. పెద్దపల్లి ? నిజామాబాద్ రైల్వే లైన్?లో అండర్? బ్రిడ్జిల నిర్మాణం చేశారు. అండర్? బ్రిడ్జిల కింది నుంచి భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఆర్ఓబీ తప్పనిసరి అయింది. మానేరు నదిపై నిర్మించిన బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకువచ్చి లారీలు, బస్సులు వంటి భారీ వాహనాలు నడిచే విధంగా చేయాలంటే పెద్దపల్లి జిల్లా వైపు నీరుకుళ్ల వద్ద ఆర్?ఓబీ నిర్మాణం చేయాల్సి ఉంది. పెద్దపల్లి ? నిజామాబాద్? రైలు మార్గంలో నీరుకుళ్ల వద్ద ఆర్?ఓబీ నిర్మాణానికి రోడ్లు భవనాల శాఖ అధికారులు రూ. 15కోట్ల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కొత్త ఆర్?ఓబీ నిర్మాణం కోసం 8ఎకరాల 20గుంటల భూసేకరణ కోసం పెద్దపల్లి జిల్లా రెవెన్యూ అధికారులు రైతులకు నోటీసులు అందజేశారు. భూసేకరణతో కలుపుకొని ఆర్?ఓబీ నిర్మాణానికి రూ. 20కోట్లకు పైగా ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. మానేరు నదిపై నీరుకుళ్ల, వేగురుపల్లి గ్రామాల మధ్య నిర్మించిన వంతెన అందుబాటులోకి తీసుకురావడానికి రోడ్లు భవనాల శాఖ అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన కరువైయింది. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, ఆఫీసర్లు కల్పించుకొని ఆర్?ఓబీ పనుల కోసం నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి మానేరుపై నిర్మించిన వంతెనను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు దూర భారం తగ్గించాలని కోరుతున్నారు.

## కాంగ్రెస్ అభియాన్ ప్రారంభం

**మేడ్చల్**

మేడ్చల్ జిల్లా అల్వాల్ మున్సిపాలిటీ, మచ్చ బొల్లారం 133 డివిజన్ పరిధి కౌకూరులో బుధవారం హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసిసి మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా తెలుసుకున్న సందేశాన్ని, టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మల్కాజ్గిరి నియోజకవర్గంలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమం ద్వారా రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రజలకు చేరవేయడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ పైన ఒక చార్జి షీటు, బిజెపి పైన ఒక ఛార్జ్ షీటు తీసుకొని ప్రజలకు వివరిస్తూ, వారి యొక్క సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా కౌకూర్ లోని రాజీవ్ గృహకల్ప కాలని, వాంబే హౌసెస్ లో ఇంటింటికి పాదయాత్ర చేస్తు వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ఇచ్చిన రాజీవ్ గృహకల్ప కాలనీలో ముఖ్యంగా నీటి సమస్య ఉందని, స్థానిక పాలకులు సమస్యలు తీర్చడంలో విఫలమైనారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్ 500 రూపాయలకు తెస్తామని, పేదల ఆరోగ్య రక్ష అయిన ఆరోగ్యశ్రీ పథకాన్ని పునరుద్ధరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు చేదు అనుభవం

**విజయవాడ :**

ఎన్టీఆర్ జిల్లా నందిగామలో స్థానిక ఎమ్మెల్యేపై ఓ కుటుంబంలో నెలకొన్న వ్యతిరేకత తీవ్రమైన ఉద్రిక్తతకు దారి తీసింది. గడపగడపకు వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ఘటన జరిగింది. మా ఇంటికి రావద్దు ఎమ్మెల్యే గారు అంటూ గ్రామస్థులు కొందరు తెగేసి చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. గడపగడపకు వైఎస్ఆర్ సీపీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న స్థానిక ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావును స్థానికులు నిలదీశారు. తమకు ఇళ్లు లేవు, కరెంట్ స్తంభాలు లేవు అని నిలదీశారు. అది గొడవకు దారి తీయడంతో ఎమ్మెల్యే సిబ్బందితో గ్రామస్థులు బాహాబాహీకి దిగారు. ఓట్లు అడగడానికి మళ్లీ వస్తారా మా దగ్గరికి అప్పుడు చెబుతాం మేం అని గ్రామస్థులు తేల్చి చెప్పారు. తమ ఇంటికి రావొద్దని పరిటాల గ్రామ ప్రజలు బహిరంగంగానే తేల్చి చెప్పారు. ఈ ప్రాంతంలో లబ్ధిదారులైన తమకు ప్రభుత్వ పథకాలు అందించడంలో వాలంటీర్ నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని వాపోయారు. పార్టీకి అనుకూలంగా ఉంటేనే వాలంటీరు ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను నిలదీసి వార్డు ప్రజలు అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. రెండు వర్గాల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

## రేవంత్ కి చేదు అనుభవం

**వరంగల్ :**

భూపాలపల్లిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో.. బీఆర్ఎస్ కార్యకర్తలపై ఆయనపై దాడి చేశారు. కోడిగుడ్లు, తమోటాలు విసిరారు. ఇవి రేవంత్ రెడ్డికి తగలలేదు కానీ, సభలోకి కొంతమందికి తగిలాయి. బీఆర్ఎస్ కార్యకర్తల్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించినా.. బీఆర్ఎస్ కార్యకర్తలు ఆపకుండా దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో కాటారం ఎస్సై శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన తలకు దెబ్బలు తగలడంతో, వెంటనే ఆసుపత్రికి తరలించారు. మరోవైపు.. రేవంత్ రెడ్డి సభలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ కార్యకర్తల్ని పోలీసులు అడ్డగించి, స్థానిక సినిమా థియేటర్‌లో బంధించారు. ఈ దాడిపై రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. తనపై కోడిగుడ్లు, తమోటాలు విసరడం కాదని.. దమ్ముంటే సభ వద్దకు రావాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డికి సవాల్ విసిరారు. తాను తలచుకుంటే.. నీ ఇల్లు ఉండదంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇదే సమయంలో జిల్లా ఎస్పీపై కూడా రేవంత్ నిప్పులు చెరిగారు. "గండ్ర నీకు చుట్టం కావొచ్చు, నీ గుడ్డలు ఊడే సమయం ఆసన్నమైంది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అధికారం శాశ్వతం అనుకుంటున్నావా? అని ఎస్పీని ప్రశ్నించారు. తమ సభపై ఆవారాగాళ్లు దాడులు చేస్తుంటే.. చూస్తూ ఊరికే ఉంటారా? అంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ సభ ఉందని తాము ఒక రోజు వాయిదా వేసుకున్నామని.. కానీ దాడులు జరుగుతుంటే మీరు పట్టించుకోవడం లేదంటూ ఎస్పీ, పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సిలిండర్ పేలి ఐదుగురికి గాయాలు

**తిరుపతి**

సూళ్లూరుపేట పట్టణంలోని మహాదేవయ్య నగర్ ప్రాంతంలో ఒక ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన 5 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిలో ముగ్గురు పిల్లలున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నో ఆఫీసు అంటున్న ఐటీ ఎంప్లాయిస్

**ముంబై:**

వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ ఇక ముగిసినట్టేనా..? ఇప్పుడిదే అంశంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. కొవిడ్ తగ్గిపోయి సాధారణ పరిస్థితులు వచ్చినప్పటికీ చాలా మంది ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్‌కే మొగ్గు చూపుతున్నారు. కంపెనీలు కూడా ఎటూ తేల్చుకోలేక పోతున్నాయి. ఈ ఆప్షన్ ఉంచాలా తీసేయాలా అన్న సందిగ్ధంలో పడ్డాయి. అప్పటికీ కొన్ని సంస్థలు ఈ ఆప్షన్‌ను తొలగించాయి. మరి కొన్ని హైబ్రిడ్ మోడల్‌ను అనుసరిస్తున్నాయి. దీనిపై ఓ ఆసక్తికర సర్వే వెలుగులోకి వచ్చింది. ఉజీశ్రీశ్రీబీజూ ఖీవబవజీతీఇష్ట్ర ాబిబీటఎ ప్రకారం...పాండెమిక్ తరవాత కేవలం 9% మంది మాత్రమే ఆఫీస్‌కు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. 32% మంది వర్క్ ఫ్రమ్ హోమ్‌కే ఓటు వేస్తున్నారు. 59% మంది హైబ్రిడ్ మోడల్‌కు ఓకే చెప్పారు. అయితే..హైబ్రిడ్ వర్క్ మోడల్‌లో ఎన్ని రోజులు ఆఫీస్‌కు రావాలన్న క్లారిటీ కొన్ని కంపెనీలు ఇవ్వడం లేదు. ఉద్యోగులే తమ వీలు ప్రకారం ఆఫీస్‌లకు వెళ్తున్నారు. అయితే...మేనేజర్‌లకు ఇప్పుడు కొత్త తలనొప్పి పట్టుకుంది. చాలా మంది ఎంప్లాయిస్ ఆఫీస్‌కు వచ్చి పని చేసేందుకు పెద్దగా ఇంట్రెస్ట్ చూపించడం లేదు. ప్రొడక్టివిటీ తగ్గిపోతుందని ఎంతగా చెబుతున్నా పట్టించుకోవడం లేదు. పైగా ఒత్తిడి చేస్తే కంపెనీ మారిపోతున్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తే ప్రొడక్టివిటీ తగ్గుతుందన్న వాదనను కొట్టి పారేస్తున్నారు. మైక్రోసాఫ్ట్ అధ్యయనం ప్రకారం..11 దేశాల్లోని 20 వేల మందిని విచారించగా...87% మంది చిఈఊతో ప్రొడక్టివిటీ పెరిగిందని తేల్చి చెప్పారు. 12% మంది టీమ్ లీడర్స్ కూడా దీన్ని అంగీకరిస్తున్నారు. అయితే అన్ని సందర్భాల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ మేలు చేస్తుందని అనుకోలేమన్నది వెల్లడించిన విషయం. ఉద్యోగులంతా కలిసి పని చేయాల్సిన పరిస్థితులు వచ్చినప్పుడు ఆఫీస్‌లకు రావాలనే అంటున్నారు కొందరు నిపుణులు. అంతే కాదు. ఎవరి ఇళ్లలో వాళ్లు పని చేసుకోవడం వల్ల కొత్త టార్గెట్‌లు పెట్టుకోడానికి వీలుండదని, అది వాళ్ల కెరీర్‌కు కూడా ఇబ్బంది కలిగిస్తుందని వివరిస్తున్నారు. ఇక్కడే మరో సమస్య కూడా ఉంది. సిటీల్లో ట్రాఫిక్‌ను దాటుకుని ఆఫీస్‌లకు వెళ్లాల్సి వచ్చినప్పుడు చాలా మంది ఉద్యోగులు అసహనానికి గురవుతున్నారు. అందుకే వర్క్ ఫ్రమ్ హోమ్ ఆప్షన్‌నే ప్రిఫర్ చేస్తున్నారు. అందుకే ఫ్లెక్సిబుల్‌గా ఏ షిఫ్ట్‌లోనైనా పని చేసుకునే వీలు కల్పిస్తే బాగుటుందని సూచిస్తున్నారు టెక్ నిపుణులు. ఏదేమైనా ఒంటరిగా పని చేసుకోవాలా..? లేదంటే ఆఫీస్‌కు వెళ్లి అందరితో పాటు కలిసి పని చేయాలా అన్న నిర్ణయం వ్యక్తిగతం అని చెబుతున్నారు.

# నష్ట నివారాణ చర్యల్లో ఆదానీ గ్రూప్

**ముంబై:**

షేర్లను కుదవపెట్టి తెచ్చిన రుణాలను చెల్లించేందుకు అదానీ గ్రూప్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ ఏడాది మార్చి నెలాకరుకు ముందే 690-790 మిలియన్ డాలర్ల రుణాన్ని చెల్లించనుందని తెలిసింది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు కొందరు ఈ విషయాన్ని మీడియాకు వివరించారు. షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్ బర్గ్ (ఊతినిటవనిఎవతీణ ఖీవబవజీతీఇష్ట్ర) దాడితో నష్టపోయిన పరపతిని తిరిగి దక్కించుకొనేందుకు కంపెనీ శ్రమిస్తోంది. అదానీ గ్రీన్ ఎనర్జీ సైతం రీఫైనాన్స్ చేసేందుకు ప్రయత్నిస్తోంది. మూడేళ్ల క్రెడిట్ లైన్‌తో 2024 బాండ్ల ద్వారా 800 డాలర్లు జొప్పించనుంది. మంగళవారం హాంకాంగ్‌లో నిర్వహించిన బాండ్ హోల్డర్ల సమావేశంలో కంపెనీ యాజమాన్యం తమ ప్రణాళికలను వివరించింది. అప్పులు తీర్చడంపై కంపెనీ ప్రతినిధులు ఎవ్వరూ అధికారికంగా మీడియాకు చెప్పలేదు. అమెరికా షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ నివేదిక బయటకు వచ్చాక అదానీ గ్రూప్ కంపెనీలు విలవిల్లాడిపోయాయి. ఇన్వెస్టర్లు ఈ కంపెనీల షేర్లను తెగనమ్మారు. దాంతో జనవరి 24 నుంచి అదానీ గ్రూప్ ఏకంగా రూ.12 లక్షల కోట్ల మార్కెట్ విలువను నష్టపోయింది. కాగా నివేదికలో ఉన్న వివరాలన్నీ అవాస్తవాలేనని, తామెలాంటి మోసాలకు పాల్పడలేదని కంపెనీ ప్రతిఘటించింది. ఇన్వెస్టర్లలో ఆందోళన తగ్గించేందుకు, వారిలో ఆత్మవిశ్వాసం పెంచేందుకు ఫిబ్రవరి మొదట్లో బాండ్‌హోల్డర్లతో అదానీ ఇప్పటికే సమావేశం నిర్వహించారు. కొన్ని కంపెనీలకు సంబంధించిన రీ ఫైనాన్స్ ప్రణాళికలను వివరించారు. షేర్లను తనఖా పెట్టి తీసుకున్న రుణాలను పూర్తిగా చెల్లించబోతున్నట్టు పేర్కొన్నారు. అదానీ గ్రూప్ షేర్లన్నీ లాభాల్లో పరుగులు పెడుతున్నాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు ధర రోజువారీ కనిష్ఠ స్థాయి నుంచి 24 శాతం పెరిగింది. పది కంపెనీల్లో ఎనిమిది ఎగిశాయి. ఎంఎస్ఈఐ వెయిటేజీ మార్పులు, బ్యాంకర్లు రుణాలపై యథాతథ స్థితిని ప్రకటించడమే ఇందుకు కారణాలని తెలిసింది. ఫోర్బ్స్ ధనవంతుల జాబితాలో, గౌతమ్ అదానీ ఇప్పుడు 38వ స్థానంలో ఉన్నారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక రాక ముందున్న మూడో స్థానం నుంచి, ఇప్పుడున్న 38వ స్థానానికి, చాలా కిందకు పడిపోయారు. ఫోర్బ్స్ రియల్ టైమ్ ట్రాకర్ ప్రకారం, ప్రస్తుతం అదానీ నికర విలువ 33.4 బిలియన్ డాలర్లు. 2023 జనవరి 24న హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక రాక ముందు ఈ విలువ 119 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ నెల రోజుల్లోనే దాదాపు మూడొంతుల సంపద లేదా 85 బిలియన్ డాలర్లకు పైగా కోత పడింది. అయితే, ప్రపంచ ధనవంతులను ఫాలో అయ్యే బ్లూంబెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, ప్రపంచ కుబేరుల్లో అదానీ 30వ స్థానంలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన సంపద విలువ 40 బిలియన్ డాలర్లు.

## శాశ్వత లోక్ అదాలత్ ఛైర్ పర్సన్ గా మేరీ గ్రేస్ కుమారి

**ఏలూరు**

పశ్చిమగోదావరి జిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్ పర్సన్ గా బుధవారం మేరీ గ్రేస్ కుమారి బాధ్యతలు చేపట్టారు. ఆమెకు న్యాయవాదులు గుంటూరు బాబు గణేష్, గుంటూరు చంద్రమౌళి లు శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో ఫోక్సో కోర్టు న్యాయమూర్తిగా విశేష సేవలు అందించి, పదవి విరమణ చేసిన మేరీ గ్రేస్ కుమారి ని తిరిగి శాశ్వత లోక్ అదాలత్ చైర్ పర్సన్ గా నియమించడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె ఆధ్వర్యంలో శాశ్వత లోక్ అదాలత్ పశ్చిమగోదావరి జిల్లాలో చక్కటి సేవలు అందజేస్తుందని న్యాయవాదులు గుంటూరు బాబు గణేష్, గుంటూరు చంద్రమౌళి తెలియజేశారు. లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ చీఫ్ మునీశ్వరరావు, డిప్యూటీ చీఫ్ కౌన్సిల్ రామ్మోహన్ రావు, అసిస్టెంట్ కౌన్సిల్ టి మధు లు పాల్గొన్నారు



# సమ్మె నోటీసు ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగులు

**విజయవాడ :**

తమ డిమాండ్లను, సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని కలిసి ఉద్యోగ నేతలు ఆందోళనల కార్యాచరణ నోటీసులు అందించారు. మార్చి 9వ తేదీ నుంచి రాష్ట్రంలో దశలవారీగా ఉద్యమాలు చేపడతామని నోటీసుల్లో పేర్కొన్నారు. ఉద్యోగుల కోసం కేటాయించిన బడ్జెట్ ను ఎందుకు పక్కదారి పట్టిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీతాల కోసం ఉద్యోగాలు వేచి చూడాల్సిన పరిస్థితి తీసుకువచ్చారని ఉద్యోగ నేతలు అన్నారు. డీఏ బకాయిలు, సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్, సరెండర్ లీవులు కూడా తీసుకుంటున్నారని వాపోయారు. ఏపీ ప్రభుత్వం ఉద్యోగులను అవహేళ చేస్తోందని ఆరోపించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల పట్ల హేళనగా పోస్టు పెడుతున్నారని తెలిపారు. సీపీఎస్ రద్దు హామీ ఇచ్చి రాష్ట్రాలు ఆ పని చేస్తున్నాయని, కానీ ఏపీ సర్కారు మాత్రం హామీని తుంగలో తొక్కిందని అన్నారు. 62 ఏళ్ల ఉద్యోగ విరమణ వయస్సు పెంపును ఇప్పటికీ కొందరు ఉద్యోగులకు అమలు చేయడం లేదని వెల్లడించారు. ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వ కనుసన్నల్లో ఉన్నారనే విమర్శలు చేస్తున్నారని చెప్పారు. ఉద్యోగులకు ఎలాంటి ఆటంకం ఉండబోదని, ప్రతి ఒక్కరూ ఆందోళనల్లో పాల్గొనాలని ఉద్యోగ సంఘాల నేతలు సూచించారు. ప్రతి ఒక్కరూ ఉద్యమ కార్యాచరణలో భాగం కావాలని పిలుపునిచ్చారు. మార్చి 9వ తేదీ నుండి దశల వారీగా ఆందోళనలు చేస్తామని ఏపీ ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. సెల్ డౌన్, పెన్ డౌన్, లంచ్ బ్రేక్ సమయాల్లో ఆందోళనలు నిర్వహిస్తామని ఉద్యోగ నాయకులు తెలిపారు. చివరికి కలెక్టరేట్లలో స్పందన కార్యక్రమాల్లో దరఖాస్తులు అందజేస్తామని తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమాలు ముగిసిన తర్వాత తదుపరి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. పీఆర్సీ వల్ల ఉద్యోగుల్లో ఉద్యోగ సంఘాల, నేతల పట్ల విశ్వాసం పోయిందని తెలిపారు. అందుకే ఉద్యోగుల్లో ద్రోహిగా మిగిలిపోకూడదనే ఈ ఉద్యమ కార్యాచరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. సర్కారు లిఖితపూర్వక హామీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. లిఖితపూర్వకమైన హామీ ఇస్తేనే ఉద్యమాన్ని విరమిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగుల సంఘం మాత్రమే ఒంటరిగా ఆందోళన కార్యాచరణ ప్రకటించిందని వెల్లడించారు.

## తిరుమలలో శుభ్రం ఎక్కడ ఉంది

**తిరుమల**

తిరుమల శ్రీనివాసుడిని ఈ ఉదయం డిప్యూటీ సీఎం నారాయణ స్వామి దర్శించుకున్నారు. దర్శనం అనంతరం బయటకు వస్తున్న ఆయనకు విచిత్ర అనుభవం ఎదురైంది. అటుగా వచ్చిన మహిళ ఆయనను గుర్తు పట్టలేదు. అయినా సరే అక్కడ ఉండే సమస్యలు ఏకరవు పెట్టారు. తిరుమలలో మంత్రి నారాయణ స్వామితో మహిళా భక్తురాలు ఏమన్నారంటే... స్వామీ మీరు ఎవరో కానీ... మీరు మంత్రి పదవి అదా అని అడిగారుదానికి నారాయణ స్వామి తలూపుతూ అవును అన్నట్టు చెప్పారు. పక్కనే ఉన్న వ్యక్తి ఆయన మంత్రే మీ సమస్య ఏంటో చెప్పండి అన్నారు. గదులు కేటాయింపు వద్ద, క్యూ లైన్స్ కొన్ని చోట్ల మురుగు వాసన వస్తుంది కొంచెం పట్టించుకోండి సార్ అంటూ భక్తురాలు తన సమస్యను చెప్పుకున్నారు. అసలు అక్కడ నీట్‌నెస్ ఉందా అంటూ ప్రశ్నించారు. మంత్రి స్పందించి చెప్తానంటూ దండం పెట్టి వెళ్లిపోతున్నా ఆమె తన బాధను వివరిస్తూనే ఉన్నారు. ఈవోకు ఫోన్ చేస్తే కలవడం లేదన్నారు సదరు మహిళా భక్తురాలు. డయల్ యువర్ ఈవోకు ఫోన్ చేశామన్నారు. ఈ సమస్యను చెప్తానంటూ అక్కడి నుంచి డిప్యూటీ సీఎం నారాయణ స్వామి వెళ్లిపోయారు.

## ఫైనాన్స్ కట్టలేదని వ్యక్తి అపహరణ

**కాకినాడ :**

డా.బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కిడ్నాప్ కలకలం రేపింది. ఫైనాన్సియర్ల ఆగడాలు ఎంతలా శ్రుతిమించాయో చెప్పడానికి ఇదో ఉదాహరణ అంటున్నారు స్థానిక ప్రజలు. తీసుకున్న మోటార్ బైక్ ఈఎంఐ చెల్లించలేదని ఓ వ్యక్తినే ఎత్తుకెళ్లారు ఫైనాన్సియర్‌లు. భయంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. అమలాపురంలో నివసించే రవీంద్ర స్థానికంగా ఉండే పూజిత మోటార్ బైక్ ఫైనాన్స్ కంపెనీ వద్ద లోన్‌పై టూవీలర్ తీసుకున్నారు. ఈఎంఐలు రెండు నెలలుగా చెల్లించడం లేదని రవీంద్రను ఎత్తుకెళ్లిపోయారు ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు. ఇంట్లో కూడా సమాచారం ఇవ్వకుండా తీసుకెళ్లిపోయి నిర్బంధించారు. 12వేల రూపాయలు చెల్లించిన తర్వాత విడిపిస్తామని చెప్పారు. కొద్ది రోజుల్లోనే మొత్తం చెల్లిస్తామని చెప్పినా కంపెనీ ప్రతినిధులు వినలేదట. విషయం తెలుసుకున్న రవీంద్ర భార్య శిరీష టెన్షన్ పడ్డారు. గర్భిణిగా ఉన్న ఆమెకు భర్తను ఎక్కడి తీసుకెళ్లారో తెలియక ఆందోళన పడింది. చివరకు ఎవరూ స్పందించకపోవడంతో అమలాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భర్త రవీంద్ర ఫైనాన్స్ కంపెనీలో మోటార్ బైక్ తీసుకుని రెండు నెలలకు ఈఎంఐ చెల్లించలేదని తెలిపారు. రెండు నెలలకు రూ.12 వేలు బకాయి పడ్డారని వివరించారు. అయితే కొద్ది రోజుల్లో మొత్తం నగదు చెల్లిస్తామని ఫైనాన్స్ కంపెనీ చెప్పామన్నారు. అయినా వాళ్లు వినిపించుకోలేదని వాపోయారు. నిర్దాక్షణ్యంగా తన భర్తను తీసుకు వెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము అమలాపురం ముస్లిం వీధిలో అద్దెకు ఉంటున్నామని ,తాను ఎనిమిదో నెల గర్భిణీనని తమకు న్యాయం చెయ్యాలని శిరీష కోరారు. దీనిపై పోలీసులు కేసు రిజిస్టర్ చేసుకొని ఫైనాన్స్ సిబ్బందిని పిలిచి మాట్లాడారు.

## ఘనంగా యాదాద్రి బ్రహ్మోత్సవాలు

**యాదగిరిగుట్ట.**

వాయిస్: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు స్వామివారు శ్రీమహావిష్ణు అలంకారంలో గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. విష్ణుమూర్తి అలంకారంలో గరుడ వాహనంపై ఆలయ తిరువీధుల్లో స్వామివారు ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. వజ్ర వైఢూర్యాల ధరించిన స్వామివారు ఆలయ తిరువీధులో ఊరేగుతూ దగదగ మెరిసిపోయారు. రాత్రి 8 గంటలకు రథోత్సవం వైభవంగా జరపనున్నారు... మరోవైపు రాత్రి 8 గంటలకు రథోత్సవం సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భారీ బందోబస్తు చేశారు. పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ప్రజలంతా పోలీసులకు సహకరించాలని, శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని యాదగిరిగుట్ట పోలీసులు తెలిపారు..

## క్షుద్ర పూజల కలకలం...

**బాపట్ల**

బాపట్ల జిల్లామార్టూరు మండలం మార్టూరు గ్రామం లో(శరణ్య న్యూస్)శివారు ప్రాంతంలో క్షుద్రపూజలు కలకలం సృష్టిస్తున్నాయి. రాంనగర్లోని శ్రీచైతన్య స్కూలకు సమీపంలోని ఖాళీ స్థలంలో కొబ్బరికాయ, నిమ్మకాయలు, కుంకుమ, పసుపులతో పూజలు చేసిన ఆనవాళ్లు ఉండటంతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. పూజలు జరిగిన ప్రదేశంలోనే పురుషుడి బట్టలు కూడ ఉండటంతో ఎవరి మీదైన చేతబడి జరిగిందా అని కాలనీ వాసులు బెదిరిపోతున్నారు. అటువైపు వెళ్లేందుకు ఎవరూ సాహసించటం లేదు. ఈ క్షుద్రపూజలు అర్ధరాత్రి సమయంలో జరిగి ఉంటాయని అనుమానిస్తున్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మార్టూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# తెలుగు తమ్ముళ్లలో చలనం

**వరంగల్ :**

తెలంగాణలో టీడీపీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఆ క్రమంలో ఇప్పటికే ఆయన అధ్యక్షతన ఖమ్మం వేదికగా నిర్వహించిన భారీ బహిరంగ సభ సూపర్ డూపర్ సక్సెస్ అయింది. అలాగే తాజాగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రారంభించారు. మరోవైపు మార్చి 29వ తేదీ..తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకొని.. హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఆ పార్టీ అగ్రనాయకత్వం నిర్ణయించినట్లు సమాచారం. తెలంగాణ గెడ్డ.. అదీ హైదరాబాద్ నడిబొడ్డు ఓల్డ్ ఎమ్మెల్యే కోర్టర్స్‌లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించన విషయం తెలిసిందే. దీంతో హైదరాబాద్ వేదికగా సభ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. 2014లో ఓ వైపు రాష్ట్ర విభజన జరగగా.. మరోవైపు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధికారంలోకి వచ్చినా.. తెలంగాణలో మాత్రం తెరాస( ఇప్పుడు బీఆర్ఎస్) అధికారం చేజిక్కించుకుంది. దీంతో ఆ పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఆ ఎన్నికల్లో తెలుగుదేశం కొన్ని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకొంది. అయితే రాష్ట్రంలో చోటు చేసుకున్న వరుస పరిణామాల నేపథ్యంలోతెలుగుదేశం టికెట్ పై గెలిచిన వారంతా వారంతా.. దాదాపుగా కేసీఆర్ నేతృత్వంలోని అధికార పార్టీలోకి జంప్ చేసేశారు. దీంతో తెలంగాణలోని పసుపు పార్టీ శ్రేణుల్లో ఓ విధమైన నిశ్శబ్దం ఆవరించింది. మరోవైపు తెలంగాణ నినాదంతో... ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకోవడమే కాదు.. ముఖ్యమంత్రి పీఠాన్ని కైవసం చేసుకున్న గులాబీ బాస్ కేసీఆర్, ఇటీవల టీఆర్ఎస్‌లో తెలంగాణ పదాన్ని పక్కన పెట్టి.. ఆ స్థానంలో భారత్ అనే పదాన్ని ఆయన చేర్చారు. దీంతో టీఆర్ఎస్ కాస్తా బీఆర్ఎస్ గా రూపాంతరం చెందింది. దీంతో కేసీఆర్ ఏర్పాటు చేసిన ప్రాంతీయ పార్టీ కాస్తా.. బీఆర్ఎస్ పార్టీగా మారి .. జాతీయ పార్టీగా మారిపోయింది. ఇక ఈ ఏడాది చివరలో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని.. తెలుగుదేశం నేతలు..వచ్చే ఎన్నికల్లో పసుపు పార్టీ సత్తా చాటాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. ఆ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో... గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పోల్చుతూ.. ప్రజల్లోకి వెడుతున్నారు. అలాగే ఉమ్మడి రాష్ట్రంలో అదీ టీడీపీ ప్రభుత్వ హయాంలో పరిపాలన, అభివృద్ధి, శాంతి భద్రతలు, ఉద్యోగ కల్పన.. రాజధాని హైదరాబాద్ నగరాభివృద్ధి, ఐటీ పరిశ్రమ, సైబరాబాద్ నిర్మాణం తదితర అంశాలను సైతం ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లేందుకు ఆ పార్టీ శ్రేణులు ఇప్పటికే సమాయత్తం అయ్యాయి. ఇక తెలంగాణలో ఆంధ్ర సెటిలర్లు అత్యధికంగా ఉన్న పలు జిల్లాలు, ప్రాంతాలపై తెలుగుదేశం పార్టీ ఫోకస్ పెట్టింది. ఆయా ప్రాంతాల్లో సభలు, సమావేశాలు నిర్వహించే దిశగా తెలుగుదేశం అగ్రనాయకత్వం అడుగులు వేస్తోంది. ఇక తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడిగా కాసాని జ్ఞానేశ్వర్ పగ్గాలు అందుకున్న తర్వాత పార్టీలో నయా జోష్ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇంకోవైపు.. తెలంగాణ సీఎం కేసీఆర్.. ఆంధ్రప్రదేశ్‌లో బీఆర్ఎస్ పార్టీని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు, సాధ్యమైనంత త్వరలో అక్కడ భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఇక వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టాలని బీజేపీ కృతనిశ్చయంతో ఉంది. అందుకోసం ఆ పార్టీ కేంద్ర నాయకత్వమే కాదు.. రాష్ట్ర నాయకత్వం సైతం ప్రణాళికలు సిద్ధం చేసుకొంటూ.. ముందుకు సాగుతోంది. అలాంటి వేళ.. అటు బీఆర్ఎస్ కి, ఇటు బీజేపీకి వచ్చే ఎన్నికల్లో పోటీ ఇచ్చే దిశగా సైకిల్ పార్టీ అధినేత చంద్రబాబు.. తన రాజకీయ చాణక్యాన్ని ప్రదర్శించేందుకు సిద్ధమవుతోన్నట్లు తెలుస్తోంది.

# డాక్టర్ ప్రీతికి నివాళులు

**పాలకొండ**

పార్వతిపురం మన్యం జిల్లా పాలకొండ డివిజన్ కేంద్రంగా తెలంగాణ రాష్ట్రంలో కాకతీయ మెడికల్ కాలేజీలో జరిగిన అమానవీయ బలవంతపు మరణ కారణానికి గురి అయిన గిరిజన మెడికల్ విద్యార్థిని ఆయన డాక్టర్ ప్రీతి మరణానికి కారుకులైన వారిని వెంటనే శిక్షించాలని ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫారం మన్యం జిల్లా అధ్యక్షులు బత్తిని మోహన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీతో నివాళు లర్పించారు. దళిత గిరిజన విద్యార్థులు పెద్దచదువు కి నోచుకోకూడదా? ఆడపిల్లల పట్ల కాకతీయ మెడికల్ కాలేజీలో జరుగుతున్నటువంటి ర్యాగింగ్ ఆకృత్యాలకు నిష్కారణంగా గిరిజన యువతి డాక్టర్ ప్రీతి బలైయిందని(గ్ర్యా)ంతికి లోనై నివాళు లర్పించారు తెలుగు రాష్ట్రాల్లో ఆడపిల్లలకు రక్షణ లేదని, ప్రత్యేక చట్టాలు ఉన్న ప్రభుత్వ చర్యలు శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు ప్రీతి మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు దళిత గిరిజన విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిరంకుశ ద్వారానే బయటపడిందని గతంలో రోహిత్ వేముల మరణానికి కూడా ఇటువంటి కారణాలే ఉన్నాయని గుర్తు చేశారు తెలుగు రాష్ట్రాల్లో దళిత గిరిజన ఆడపిల్లలకు ప్రత్యేక చట్టాన్ని అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తూ స్థానిక యాలం అంబేద్కర్ జంక్షన్ వద్ద ర్యాలీ నిర్వహించి డాక్టర్ ప్రీతి గారికి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా దళిత గిరిజన ఐక్యత వర్ధిల్లాలని దళిత గిరిజనులు కలిసి హక్కుల కోసం పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు కార్యక్రమంలో ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫారం పాలకొండ డివిజన్ కమిటీ సభ్యులు యమ్మల సతీష్ గారు, మండల కమిటీ సభ్యులు రాయి రామకృష్ణ, వెలగాడ రాజ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు గురుబిల్లి రవికుమార్, పట్టణ కమిటీ సభ్యులు నలబారిక సురేష్, రాకోటి వెంకట్రావు, తెర్లంగి సుధాకర్, బొంతు గవరయ్య, తదితరులు పాల్గొని నివాళు లర్పించారు

# అనాధ పిల్లల ఆకలి తీర్చే భాగ్యం అందరికీ రాదు..


**కమాన్ పూర్**

విధి వంచితులైన అనాధ పిల్లల ఆకలి తీర్చే అవకాశం అందరికీ రాదని, ఆ ఆలోచన రావడమే దైవ సంకల్పంగా భావించాలని బి ఆర్ ఎస్ పార్టీ రామగుండం సమన్వయ కమిటీ సభ్యులు దేవీ లక్ష్మి నర్సయ్య అన్నారు. ఈ మేరకు గోదావరిఖని నగరంలోని కళ్యాణ్ నగర్ కు చెందిన పాడి సృజన్ 23వ పుట్టినరోజు వేడుకలను బుధవారం నాడు స్థానిక గాంధీ నగర్ లో ఎండిహెచ్డబ్ల్యూఎస్ అనాధ పిల్లల సంరక్షణ కేంద్రంలో పిల్లల మధ్య ఘనంగా జరుపుకున్నారు. పిల్లలకు అన్నదానం నిమిత్తం 50 కిలోల బియ్యం బి ఆర్ ఎస్ నాయకులు దేవీ లక్ష్మి నరసయ్య చేతులమీదుగా వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టినరోజు వేడుకల కోసం ఆర్భాటాలకు పోయి వృధా ఖర్చులు చేయకుండా.. అనాధ పిల్లలకు ఒకరోజు అన్నం పెట్టాలని ఆలోచన రావడం అదృష్టంగా భావించాలని సూచించారు. ఎక్కడో మారుమూల గ్రామాలలో తల్లిదండ్రులను కోల్పోయి అనాధలుగా మిగిలిన చిన్న వయసు పిల్లలను తీసుకువచ్చి వారికి అమ్మ నాన్న లోటు తెలియకుండా ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న ఆశ్రమ నిర్వాహకులు పోచంపల్లి రాజయ్య, భూలక్ష్మి దంపతులు ఆదర్శప్రాయులని కొనియాడారు. వీరికి ఆ భగవంతుడు ఎల్లవేళలా ఆశీస్సులు ఉండాలని కోరారు. ప్రార్థించే పెదవుల కంటే సాయం చేసే చేతులు మిన్న అని భావించి ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఏదో ఒక శుభకార్యం రోజునే కాకుండా తోచిన సందర్భంలో అనాధ పిల్లలకు అన్నం పెట్టడానికి పెద్ద మనసు చేసుకొని ముందుకు రావాలని కోరారు. యుక్త వయసులో పుట్టినరోజున అనాధ పిల్లలకు చేయూత అందించే ఆలోచన రావడం పట్ల సృజన ను అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కల్వల శిరీష సంజీవ్, దేవి రోహిత్, మహంకాళి బాపు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి అధికారంలోకి రావడం ఖాయం !

**మాజీ మంత్రి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి**

**ఎమ్మిగనూరు**



ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డిపేర్కొన్నారు. ఆయన బుధ వారం ఎమ్మిగనూరు పట్టణం ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి టిడిపి నాయకులతో మాట్లాడారు. టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనలకు, "యువ గళం" పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుండి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక, జీర్ణించుకోలేక ముఖ్యమంత్రి జగన్ అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అరాచకమే వైసీపీ రాజ్యాంగంగా పాలన సాగిస్తోందన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలనకు "గన్నవరం" ఘటన అద్దం పడుతోందని మండిపడ్డారు. తాము ఎందరో ముఖ్యమంత్రులను చూశామని ఇలాంటి రాక్షసత్వం కలిగిన ముఖ్యమంత్రిని చూడలేదన్నారు. జగన్ అమరావతి పై గుడ్డి ద్వేషంతో... రెండు లక్షల కోట్ల ప్రభుత్వ ఆస్తిని నిరార్థకం చేశారని దుయ్యబట్టారు. అమరావతి విధ్వంసంతో... మూడు ముక్కలాటతో.. రాష్ట్రంలో భూములు విలువ పడిపోయి 139 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యాసంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోవడంతో 60 వేల ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ మద్య నిషేధం చేస్తానని హామీ ఇచ్చి, నమ్మించి మద్యం ఆదాయాన్ని 15 ఏళ్ల పాటు బ్యాంకులకు తాకట్టు పెట్టి, 25 వేల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చి మద్యం రేట్లు మూడు రెట్లు పెంచి "పేదల సంపాదన" ను జలగల్లాగా తాగేస్తున్నారని మండిపడ్డారు.

ప్రభుత్వ పక్కా గృహ నిర్మాణాల బకాయిలను వన్ టైం సెటిల్మెంట్ పేరుతో పేదల నుండి వసూళ్ళు చేసి 4500 కోట్లు దోపిడీ చేశారని తెలిపారు. బస్సు చార్జీలు రెండుసార్లు, విద్యుత్ చార్జీలు ఏడుసార్లు పెంచి ప్రజల నడ్డి విరచిన ఘనత జగన్ దేన న్నారు. జగన్ సర్కారు రాష్ట్రంలో నీళ్లు,నిధులు, నియామకాలకు మంగళం పాడి దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని, వైసీపీ నేతలకు "ధనయజ్ఞం" తప్ప "జలయజ్ఞం" తెలియదని ఎద్దేవ చేశారు. ఒక్క ఛాన్స్ పేరుతో జగన్ కు అధికారం కట్ట పెట్టినందుకు ప్రజలు పశ్చాతాపం పడుతున్నారని, వై సీపీ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అధికారం చేపట్టిన వెంటనే జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులైన వేదవతి, గుండ్రేవుల, ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం, ఎల్.ఎల్.సి. అండర్ గ్రౌండ్ పైప్ లైన్ పనులను పూర్తి చేసి కర్నూలు జిల్లాను సస్యశ్యామలంగా మార్చి రైతులకు అంకితం చేస్తామని తెలిపారు. ఈ కార్య క్రమం లో.. ఆదోని నియోజక వర్గం టిడిపి మాజీ ఇంచార్జీ గుడిసె కృష్ణమ్మ, టిడిపి నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, గోనెగండ్ల మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డి, కదిరికోట ఆదె న్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి. అల్తాఫ్, బూదురు రాఘవేంద్ర రెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి గోనెగండ్ల ప్రభాకర్ నాయుడు, ఎమ్మిగనూరు మండలం మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, గోనెగండ్ల మాజీ సర్పంచ్ బోయ రంగముని, బాబు నాయుడు, కె. తిమ్మాపురం కురుమన్న, పార్లపల్లి పాపరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# భారాస ఎమ్మెల్యే సోదరుడు బీఎస్పీలో చేరిక

**హైదరాబాద్**

సేవ్ కుత్బుల్లాపూర్ ఏ తన ముందున్న లక్ష్యం అని, ప్రభుత్వ భూములు అన్యక్రాంతం కాకుండా కాపడటం కోసమే తాను బిఎస్పి పార్టీలో చేరబోతున్నానని కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ నాయకుడు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద తమ్ముడు కెపి విషాల్ తెలిపాడు.

కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ నాయకుడు విషాల్ బిఎస్పి పార్టీలో చేరబోతున్నాడు. బిఎస్పి మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎంపి రాంజి గౌతం, తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ మందా ప్రభాకర్ లు కుత్బుల్లాపూర్ లోని విషాల్ నివాసానికి వచ్చి మర్యాద పూర్వకంగా అయనను కలిసారు. ఈ సందర్భంగా ఎంపి రాంజీ గౌతం మాట్లాడుతూ... సేవ్ నేషన్, సేవ్ డెమోక్రసి, భారత రాజ్యంగాన్ని ని కాపాడడమే బిఎస్పి పార్టీ లక్ష్యం అని అన్నారు. పల్లెపల్లెలో ఉద్యమం చేస్తున్నాం అని, అందులో భాగమే విషాల్ ను తమ పార్టీలోకి రమ్మని ఆహ్వానిస్తున్నామని, ఆయన త్వరలో తమ పార్టీలో చేరుబోతున్నారని తెలిపారు. బిఆరెస్ నాయకుడు విషల్ మాట్లాడుతూ...ప్రభుత్వ స్దలాలు ఎక్కువగా ఉన్న కుత్బుల్లాపూర్ లో కబ్జాకు గురౌతున్నా ఎమ్మెల్యే వివేకానంద, రెవెన్యూ అధికారులు కాపాడక పోవడం ఎమ్మెల్యే పనితీరుకు నిదర్శనం అని, కబ్జాదారులకు వారు పరోక్షంగా సహాయం చేస్తున్నారని తెలిపారు. వెంటనే కుత్బుల్లాపూర్ లో 100పడకల ఆసుపత్రి, స్పోర్ట్స్ స్టేడియం, ప్రభుత్వ కార్యాలయాలకు స్వంత భవనాలను వెంటనే నిర్మించాలని ఆయన డిమాండ్ చేసారు. త్వరలో బిఎస్పి లో చేరబోతున్నానని తెలిపారు

# జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి

**బద్వేలు**



ఒక్క అవకాశం అంటూ ప్రజలను ఓట్లు అడిగారు అధికారులకు వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం గత నాలుగు సంవత్సరాల కాలంలో అధోగతి పాలయ్యింది రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు చివరికి ఉద్యోగులకు కూడా సకాలంలో జీతాలు ఇవ్వలేని దుస్థితి ప్రభుత్వానికి ఏర్పడింది గతంలో ఎప్పుడు కూడా ఇలాంటి పరిస్థితులు రాలేదు కేవలం జగన్మోహన్ రెడ్డి పాలలో మాత్రమే ఈ పరిస్థితి ఏర్పడింది వైకాపా ప్రభుత్వాన్ని ఎలా నమ్మాలో మీరే చెప్పాలని కడప పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి బద్వేలు తెలుగుదేశం పార్టీ యువనేత రితేష్ కుమార్ రెడ్డి బద్వేలు మాజీ మున్సిపల్ చైర్మన్ పార్థసారథి బద్వేలు మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షుడు గుర్రంపాటి వెంగళరెడ్డి సూటిగా ప్రశ్నించారు బుధవారం పశ్చిమ రాయలసీమ పట్టపద్రుల తెలుగుదేశం ఎమ్మెల్సీ అభ్యర్థి భూమి రెడ్డి రామ గోపాల్ రెడ్డి మద్దతుగా బద్వేల్ లో ఉదృతంగా వారు ఎన్నికల ప్రచారం చేశారు బద్వేలు బాలుర ఉన్నత పాఠశాల పూసలవాడ పాఠశాల కోర్టు తదితర ప్రాంతాల్లో వారు ప్రచారం చేశారు ఓటర్లను కలిసి ఓట్లు అడిగారు తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి ఓట్లు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని వారు కోరారు ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలన దారుణంగా తయారైందని ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెడుతూ వారిని అన్ని విధాలుగా వేధిస్తున్నారని గతంలో ఎప్పుడు కూడా ఇలాంటి సంఘటనలు అన్నారు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రం రావణ కష్టంగా మారిందని వారు ఆరోపించారు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏ రాజకీయ పార్టీ నాయకులను వేధించడం గాని అక్రమ కేసులు పెట్టడం గాని జరగలేదన్నారు వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత అవినీతి పెరిగి పోయిందని ఆరోపించారుప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలో అవినీతి ఉందని వారు అన్నారు జగన్ పాలనకు త్వరలోనే చరమగీతం పాడేందుకు రాష్ట్రంలోని ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని వారన్నారు జగన్ పాలనకు జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలే రిఫరాండమని వారు పేర్కొన్నారు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులను పట్టబద్రులు ఉపాధ్యాయులు ఓడించాలని వారు మరి మరి విజ్ఞప్తి చేశారు ఎమ్మెల్సీ ఎన్నికలు వైకాపాలనకు చరమగీతం పాడుతాయని వారు అన్నారు ఉద్యోగులు పట్ట బద్రులను వైకాపా ప్రభుత్వం అన్ని విధాల దగా చేసినట్లు వారు ఆరోపించారు ఇంకా పలు విషయాలు విలేకరుల సమావేశంలో వాళ్లు చెప్పడం జరిగింది ఎన్నికల ప్రచారంలో అట్లూరు బి కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ రెడ్డి రామచంద్రారెడ్డి కెవి సుబ్బారెడ్డి దేశం పార్టీ మహిళ నాయకురాలు ఝాన్సీ పార్టీ నాయకులు బిగ్ బాస్ జహంగీర్ కొలవలి వేణుగోపాల్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# భార్య మృతి.. భర్త ఆత్మహత్య.. పిల్లలు అనాధలు

**హైదరాబాద్**

వారిద్దరూ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. పెద్దలను కూడా ఎదిరించి పెళ్లి చేసుకున్నారు. వీరి అన్యోన్య దాంపత్యానికి ప్రతీకలుగా ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. వారిని చదివించుకుంటూ హాయిగా జీవితాన్ని గడుపుతున్నారు. కానీ నెలక్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదం వీరి కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా అది తట్టుకోలేక భర్త కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి, తండ్రి మరణంతో చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. హైదరాబాద్ రహ్మత్ నగర్ సమీపంలోని ఎస్పీఆర్ హిల్స్ లో నివసించే 34 ఏళ్ల సింప భరత్ కుమార్ బీహెచ్ఈఎల్ ఆర్టీసీ డిపోలో మెకానిక్ గా పని చేస్తున్నారు. ఏడేళ్ల కిందట మమతను ప్రేమించి వివాహం చేసుకున్నారు. వీరి అన్యోన్య దాంపత్యానికి ప్రతీకలుగా ఆరేళ్ల విశాల్, రెండేళ్ల సంయుక్తనిధి ఉన్నారు. భరత్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నెల రోజులు సెలవు కావాలని దరఖాస్తు ఇచ్చేందుకు జనవరి 31వ తేదీన భార్య, కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంపై డిపో వద్దకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఎర్రగడ్డ ఫ్లైఓవర్ మీదుగా వస్తుండగా... వెనక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. భార్య తలకు తీవ్ర గాయమై మృతి చెందగా.. భరత్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. చిన్నారి క్షేమంగా బయట పడింది. భార్య చనిపోయిన తర్వాత భరత్.. తండ్రి, పిల్లలతో కలిసి ఉంటున్నారు. మంగళవారం ఉదయం 9.45 గంటలు అయినా తాను నిద్రించిన గది తలుపు తీయలేదు. తండ్రి తలుపు తట్టినా తీయకపోవడంతో రమేష్ కు విషయాన్ని తెలిపాడు. రమేష్ కిటికీలో నుంచి చూడగా.. ఫ్యానుకు చీర కనిపించింది. తలుపు గట్టిగా నెట్టడంతో బోల్టు ఊడి తలుపు తెరుచుకుంది. అప్పటికే ఫ్యానుకు వేలాడుతూ.. అచేతనంగా కనిపించడంతో 108 అంబులెన్స్, జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.







Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950